

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 26 | హైదరాబాద్ | బుధవారం | 15-07-2026 | పేజీలు: 09


## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు

సౌదీ, హౌతీల మధ్య భీకర దాడులు, ప్రతిదాడులు

అమెరికా అండ కోరిన ప్రిన్స్ సల్మాన్

తిరుగుబాటుదారుల మధ్య ముదిరిన ఘర్షణ

విమానాశ్రయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు

సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాల బాంబుల వర్షం

ఇరాన్ విమానం రాకతో మొదలైన సరికొత్త వివాదం

ఆయుధాల తరలింపుపై సౌదీ అరేబియా అనుమానాలు

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంస్థపైనే నిఘా



## పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

జూన్‌లో 4.38 శాతానికి చేరిన ద్రవ్యోల్బణం

సామాన్యుడి బడ్జెట్ అతలాకుతలమైంది

కేంద్ర ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శలు

బీజేపీ పాలనలో ధరల భారమేననని మండిపాటు

గణాంకాలతో సహా మోదీ ప్రభుత్వాన్ని నిలదీసిన జైరాం

సామాన్యుల కష్టాలపై ప్రధాని ఎప్పుడు నోరు విప్పుతారని ప్రశ్న

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 4.38 శాతానికి పెరగడంతో మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడిని ముమ్మరం చేసింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వ పాలనలో ధరల పెరుగుదల కారణంగా దేశంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ పూర్తిగా అతలాకుతలమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన మిగతా 2లో..



# తెలంగాణ ప్రగతికి సరికొత్త రెక్కలు

2028 జూన్ 2 నాటికి వరంగల్,
ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు

తెలంగాణ విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తో చర్చలు సఫలం

రెండు ఎయిర్‌పోర్టుల పనులకు కేంద్రం పూర్తి సహకారం

2028 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ప్రారంభోత్సవ లక్ష్యం

గడువులోగా పనులు పూర్తి చేస్తామని ఇరుపక్షాల వెల్లడి

వరంగల్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హంగులు

రక్షణ రంగానికి అత్యంత కీలకమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్

దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం కానున్న తెలంగాణ

రాష్ట్ర జీడీపీ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమన్న సీఎం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి విమానాశ్రయాల విస్తరణ ఎంతో అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. తన దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ అత్యంత బిజీగా గడుపుతున్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక పెండింగ్ ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో ముగిశాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పునరుద్ధరణ, నిర్మాణ పనులపై ఈ సమావేశంలో ఒక స్పష్టమైన అవగాహన కుదిరిందని చెప్పారు. తాను ఎప్పుడు విమానాశ్రయాల ఏర్పాటు గురించి ప్రస్తావించినా, మిగతా 2లో..

## బోనాల పండుగలకు నిధులు విడుదల

రాజధానిలో వైభవంగా ఆషాఢ బోనాల జాతర!

తెలంగాణ వైభవానికి ప్రతీకగా ఆషాఢ బోనాలు

జూలై 16 నుంచి నెల పాటు ఆధ్యాత్మిక శోభ

ప్రధాన ఆలయాల్లో మొదలైన ఏర్పాట్లు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

గోల్కొండతో మొదలై లాల్‌దర్వాజా వరకు

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సాగనున్న వైభవం

3,427 ఆలయాలకు రూ.15 కోట్ల నిధుల విడుదల

ఆలయాల అభివృద్ధి,
నిర్వహణ కోసం భారీగా కేటాయింపులు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆచార సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని ఆలయాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోనున్నాయి. ఈ మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.

లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏ ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, దేవాదాయ, రోడ్లుభవనాలు, నీటి సరఫరా, మిగతా 2లో..



## సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

బీఆర్ఎస్, కాంగ్రెస్
ప్రభుత్వాలపై కిషన్‌రెడ్డి నిప్పులు

సింగరేణి భరోసా యాత్రలో
కిషన్‌రెడ్డి ఆగ్రహం

భూపాలపల్లి వేదికగా గత,
ప్రస్తుత పాలకులపై విమర్శలు

కేసీఆర్ చేతుల్లో జేబు సంస్థగా
మారిన సింగరేణి

పదిహేనేళ్లు వెనక్కి నెట్టేసారంటూ
కేంద్రమంత్రి ఆరోపణ

కార్మికుల కష్టార్జితాన్ని లూటీ
చేశారంటూ కిషన్‌రెడ్డి మండిపాటు

సొంత నియోజకవర్గాలకే
సింగరేణి నిధుల మళ్ళింపు

బొగ్గు గనుల ప్రాంతాల
నిర్లక్ష్యంపై తీవ్ర ధ్వజం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి బొగ్గు గనుల రక్షణే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర' రెండో రోజుకు చేరుకుంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ భారీ బహిరంగ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మిగతా 2లో..

## 2027 గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తాం..

ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి
తొలి విడతగా రూ.117 కోట్లు

భక్తులకు అన్ని సౌకర్యాలతో
ముందస్తు ఏర్పాట్లు

రాష్ట్ర సంక్షేమ శాఖ
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లను మిగతా 2లో..



## కాళేశ్వరం వైఫల్యం బీఆర్ఎస్ పాపమే

నిపుణులు చెబితేనే నీళ్లు నింపుతాం

మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం

బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు

కాంగ్రెస్ రాకముందే కుంగిన కాళేశ్వరం

గత పాలకుల నిర్లక్ష్యమే
కారణమన్న మంత్రి

బీఆర్ఎస్ కుట్రలను
ప్రజల ముందు ఎండగడతాం

ఊరూరా తిరుగుతూ వాస్తవాలు
వివరిస్తామని వెల్లడి




హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణలో నీటి పారుదల ప్రాజెక్టులు, కరవు పరిస్థితులపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి ముదిరింది. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. విపక్ష బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరవు పరిస్థితులు, రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు చౌకబారు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రక్తం ప్యాకెట్లతో డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాల్సిన అవసరం తమకు లేదని, కేవలం ఉనికిని కాపాడుకోవడానికే విపక్షాలు ఇలాంటి మిగతా 2లో..

# పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

పోస్ట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. బీజేపీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వడం మాత్రమే పెరిగిందని జైరాం రమేష్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం రూపంలో సామాన్య ప్రజలపై ప్రభుత్వం పెను భారాన్ని మోపిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారిక గణాంకాలే జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ధరల పెరుగుదలతో ఇంతలా ఇబ్బందులు పడుతుంటే, ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై ఎప్పుడు స్పందిస్తారని, సామాన్యుల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారని జైరాం రమేష్ సూటిగా ప్రశ్నించారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన నివేదికల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్ వచ్చేసరికి ఒక్కసారిగా 4.38 శాతానికి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్దేశించుకున్న 4 శాతం ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్య మార్కును ఇది దాటడం గమనార్హం. జనవరి నెల నుంచి అమల్లోకి వచ్చిన 2024 ప్రాతిపదిక సంవత్సరపు కొత్త శ్రేణి లెక్కల ప్రకారం, ద్రవ్యోల్బణం ఈ 4 శాతం మార్కును అధిగమించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణం ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమేనని ప్రభుత్వ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. మే నెలలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం, జూన్ నాటికి 5.32 శాతానికి చేరింది. ముఖ్యంగా వెండి, బంగారం, వజ్రాలు వంటి ఆభరణాలతో పాటు వంటింట్లో నిత్యం వాడే అల్లం, టమాటా, కిస్మిస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. మరోవైపు బంగాళా దుంప, బఠానీలు, జీలకర్రతో పాటు కార్లు, మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల వేగం కొంత తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ తన నివేదికలో వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే ధరల పెరుగుదల ప్రభావం పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలపైనే చాలా ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉంటే, పల్లెటూళ్లలో ఇది ఏకంగా 4.74 శాతంగా నమోదైంది. అదే సమయంలో పట్టణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం రేటు 3.92 శాతంగా ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి పట్టణ వాసుల కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది.

ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల భవిష్యత్తులో దేశంలో బ్యాంకు వడ్డీ రేట్లు కూడా మరింత పెరిగే ప్రమాదం ఉందని జైరాం రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే గనుక జరిగితే, బ్యాంకుల నుంచి గృహ రుణాలు (హోమ్ లోన్స్), వాహన రుణాలు తీసుకున్న మధ్యతరగతి ప్రజల నెలవారీ ఈఎంఐలు మరింత భారం కానున్నాయని హెచ్చరించారు. ఇప్పటికే ధరల దెబ్బకు సతమతమవుతున్న సామాన్యులపై ఈ వడ్డీ రేట్ల పెంపు అనేది కోలుకోలేని అదనపు భారంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఒకవైపు సామాన్య ప్రజలు రోజువారీ ఖర్చులకే ఇబ్బంది పడుతుంటే, పెద్ద పెద్ద పారిశ్రామిక వర్గాలు మరియు కార్పొరేట్ సంస్థల లాభాలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, వారి లాభాలకు మాత్రమే అండగా నిలుస్తోందని మండిపడ్డారు. ధరల భారాన్ని మాత్రం ఏమీ లేని సామాన్య ప్రజల నెత్తిన రుద్దుతున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలన్నీ సామాన్యుడిని దోచి కార్పొరేట్లకు పెట్టేలా ఉన్నాయని విమర్శించారు. ద్రవ్యోల్బణంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి వ్యతిరేక వైఖరిని కూడా జైరాం రమేష్ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధాని పదవి చేపట్టే సమయంలో మోదీ ఇచ్చిన హామీలన్నీ కేవలం బూటకపు మాటలేనని కొట్టిపారేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 'కనీస పాలన.. గరిష్ఠంగా నిజాలను కప్పిపుచ్చే ధోరణి' మాత్రమే కనిపిస్తోందని విమర్శించారు. వివాదాస్పద ఎన్నికల బాండ్ల పథకం, రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆయిల్ వ్యవహారాలపై కేంద్రం నుంచి ఇప్పటికీ సరైన సమాధానాలు రాలేదన్నారు. అలాగే పీఎం కేర్స్ నిధి నిర్వహణలో ఎలాంటి పారదర్శకత లేదని, అయోధ్య రామమందిర విరాళాల కేసులోనూ పూర్తిస్థాయి పారదర్శకత అవసరమని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ పనితీరుపై కూడా కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# బోనాల పండుగలకు నిధులు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్, ఆర్టీసీ వంటి అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయాల వద్ద క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

బోనాల ఉత్సవాలు జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడంతో ప్రారంభమవుతాయి. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక ఆగస్టు 9న లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరిగే వేడుకల కోసం అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలతో నగరం అంతా అమ్మవారి కోవెలలా మెరిసిపోనుంది.

బోనాల పండుగలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలు జూలై 20, 21, 22 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్నాయి. జూలై 20న ఎదుర్కోలు ఉత్సవం, 21న అత్యంత ఘనంగా అమ్మవారి కల్యాణం, 22న రథోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు క్రమశిక్షణతో ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఈ ఏడాది బోనాల పండుగ కోసం ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3,427 దేవాలయాలకు రూ.15,05,41,150 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులతో ఆలయాల మరమ్మతులు, భక్తులకు సౌకర్యాల కల్పనను వేగవంతం చేశారు. అమ్మవారికి సమర్పించే పట్టువస్త్రాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వమే దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అత్యధిక రద్దీ ఉండే ఆలయాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సదుపాయం కల్పిస్తున్నాం. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించాం. పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలను సిద్ధం చేసింది. భక్తిప్రపత్తులతో పండుగను జరుపుకోవాలని కోరుతున్నాం.

గోల్కొండ జగదాంబ, ఉజ్జయిని మహంకాళి, కట్ట మైసమ్మ, అక్కన్నమాదన్న దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వంటి నగరంలోని సుమారు 30 ప్రధాన దేవాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ ప్రక్రియ అంతా అత్యంత సంప్రదాయబద్ధంగా జరుగుతుంది. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఫలహారం బండ్ల ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు గొప్ప వరం. ఈ సౌకర్యం వల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ఈ మహోత్సవాలను మరింత విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. భక్తులందరూ కలిసి తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుదామని ఆకాంక్షించారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు

- **సౌదీ, హౌతీల మధ్య భీకర దాడులు, ప్రతిదాడులు**
- **అమెరికా అండ కోరిన ప్రిన్స్ సల్మాన్**
- **తిరుగుబాటుదారుల మధ్య ముదిరిన ఘర్షణ**
- **విమానాశ్రయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు**
- **సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాల బాంబుల వర్షం**
- **ఇరాన్ విమానం రాకతో మొదలైన సరికొత్త వివాదం**
- **ఆయుధాల తరలింపుపై సౌదీ అరేబియా అనుమానాలు**
- **ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంస్థపైనే నిఘా**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

పశ్చిమాసియా ప్రాంతంలో ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్ దేశ మద్దతుతో పనిచేస్తున్న హౌతీ తిరుగుబాటుదారులకు, సౌదీ అరేబియాకు మధ్య దాడులు, ప్రతిదాడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇరుపక్షాలు పరస్పరం క్షిపణులు, అత్యాధునిక డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి. ముఖ్యంగా ఇరు దేశాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు సాగుతుండటంతో తీవ్ర కలకలం రేగుతోంది. ఈ తాజా ఘర్షణల్లో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తున్నప్పటికీ, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలను సౌదీ అరేబియా ప్రభుత్వం ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

యెమెన్ దేశంలోని హౌతీల అదుపులో ఉన్న సనా అంతర్జాతీయ విమానాశ్రయంపై సౌదీ అరేబియా బలగాలు బాంబుల వర్షం కురిపించడంతోనే ఈ తాజా వివాదం మొదలైంది. ఇరాన్‌కు చెందిన 'మహాన్ ఎయిర్' అనే ఒక ప్రత్యేక విమానం సనా ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవ్వడమే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమానికి హాజరైన హౌతీ ప్రతినిధులను తీసుకుని ఈ విమానం యెమెన్‌కు వచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ విమానం రాకను తీవ్రంగా పరిగణించిన సౌదీ.. అది తిరిగి వెళ్లే లోపే సనా రన్‌వేపై వైమానిక దాడులు జరిపి దాన్ని దెబ్బతీసింది.

మహాన్ ఎయిర్ విమానం ద్వారా ఇరాన్ నుంచి ప్రమాదకరమైన ఆయుధాలు, క్షిపణి విడిభాగాలు లేదా ఇరాన్‌కు చెందిన ప్రత్యేక సైనిక సిబ్బందిని యెమెన్‌కు తరలిస్తున్నారని సౌదీ అరేబియా బలంగా అనుమానించింది. అమెరికా నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఈ మహాన్ ఎయిర్ అనే సంస్థ ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంది. అందుకే యెమెన్‌లోని అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం కూడా సౌదీ దాడులను సమర్థించింది. ఇరాన్ విమానం తమ భూభాగాన్ని వాడుకోకుండా అడ్డుకోవడానికే ఈ దాడులు చేసినట్లు స్పష్టం చేసింది. తమ ఆధీనంలో ఉన్న సనా ఎయిర్‌పోర్టుపై సౌదీ బలగాలు జరిపిన దాడులకు హౌతీలు కొన్ని గంటల్లోనే తీవ్ర ప్రతీకారం తీర్చుకున్నారు. సౌదీ అరేబియాలోని ప్రసిద్ధ 'అభా అంతర్జాతీయ విమానాశ్రయం'పై క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో దాడులు చేశారు.

ఈ దాడుల అనంతరం హౌతీల సైనిక ప్రతినిధి యాహ్యా సరీ అంతర్జాతీయ విమానయాన సంస్థలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సనా విమానాశ్రయంపై సౌదీ విధించిన ఆంక్షలను ఎత్తివేసే వరకు, సౌదీ గగనతలంలో ఎలాంటి విమానాలను నడపవద్దని చెప్పారు. రోగులను, సామాన్య ప్రజలను తరలించే విమానాలను అడ్డుకోవడానికే సౌదీ ఈ కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు.

యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులను పూర్తిగా అణచివేయడానికి సౌదీ అరేబియా ప్రభుత్వం పెద్ద వ్యూహాన్నే సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే, హౌతీలపై పూర్తి స్థాయి సైనిక చర్యలు ప్రారంభించడానికి ముందే సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపారు. ఈ సైనిక ఆపరేషన్‌కు అమెరికా మద్దతు ఇవ్వాలని కోరారు. ఒక అంతర్జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. సౌదీ తీసుకునే ఈ చర్యలకు అధ్యక్షుడు ట్రంప్ కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే సౌదీ బలగాలు హౌతీల స్థావరాలపై విరుచుకుపడ్డాయి. సౌదీ అరేబియా, హౌతీల మధ్య మళ్లీ యుద్ధ వాతావరణం తలెత్తడంపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలను నిశితంగా గమనించిన ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమైంది. యెమెన్‌తో పాటు మొత్తం పశ్చిమాసియా ప్రాంతం మరోసారి కోలుకోలేని విధంగా తీవ్ర ఘర్షణల వైపు వెళ్లే ప్రమాదం ఉందని ఐరాస రాజకీయ వ్యవహారాల సహాయ ప్రధాన కార్యదర్శి ఖాలిద్ ఖియారి హెచ్చరించారు. యుద్ధం వల్ల సామాన్య ప్రజలు నష్టపోతారని, కాబట్టి అన్ని పక్షాలు తక్షణమే దాడులు ఆపి ఐరాస ఆధ్వర్యంలో శాంతి చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న దాడులు చూస్తుంటే గతంలో యెమెన్ దేశాన్ని కుదిపేసిన భయంకరమైన అంతర్యుద్ధం గుర్తుకు వస్తోంది. 2014లో హౌతీ తిరుగుబాటుదారులు యెమెన్ రాజధాని సనాను బలవంతంగా స్వాధీనం చేసుకోవడంతో అక్కడ పెద్ద ఎత్తున ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అక్కడి అధికారిక ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు 2015లో సౌదీ అరేబియా నేతృత్వంలోని అరబ్ దేశాల కూటమి నేరుగా రంగంలోకి దిగింది. అప్పట్లో ఇరుపక్షాల మధ్య జరిగిన యుద్ధం వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది శరణార్థులుగా మారాల్సి వచ్చింది.

సుదీర్ఘ కాలం పాటు సాగిన యెమెన్ అంతర్యుద్ధానికి 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో తాత్కాలిక బ్రేక్ పడింది. ఇరుపక్షాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో, గత నాలుగేళ్లుగా ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నాయి. పెద్దగా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. కానీ, ఇప్పుడు ఇరాన్ విమానం రాకతో మొదలైన వివాదం కారణంగా ఆ కాల్పుల విరమణ ఒప్పందానికి పూర్తిగా తూట్లు పడ్డాయి. ఈ తాజా దాడుల వల్ల పశ్చిమాసియాలో శాంతి భద్రతలకు మళ్లీ పెను ముప్పు పొంచి ఉందని, దీనివల్ల ప్రపంచ ఇంధన సరఫరాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

**మొదటిపేజీ తరువాయి**



మాట్లాడుతూ తెలంగాణ ప్రగతికి ఊపిరిగా నిలిచిన సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం ఎలా వాడుకుంటున్నాయో ఆధారాలతో సహా వివరించారు. ఈ రెండు పార్టీల నిర్లక్ష్యం వల్ల సింగరేణి కార్మికులు ఈరోజు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సింగరేణి సంస్థను తన సొంత జేబు సంస్థగా మార్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకనాడు లాభాల బాటలో నడిచిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ.. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, అవినీతి విధానాల వల్ల ఏకంగా 15 సంవత్సరాలు వెనక్కి పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, వారి అనుచరులు సింగరేణి కాంట్రాక్టులను దక్కించుకుని వేల కోట్ల రూపాయలను నిస్సిగ్గుగా దోచుకున్నారని, దీనివల్ల సంస్థ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తిన్నదని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు.

తెలంగాణ బొగ్గు గనుల్లో రాత్రింబగళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికుల చెమట చుక్కలతో సింగరేణి లాభాలను గడిస్తోందని, కానీ పాలకులు మాత్రం ఆ సంస్థను తమ సొంత ఆస్తిలా భావిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు గానీ సింగరేణిని తమ 'తాత జాగీరు' లాగా వాడుకుంటున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, సంస్థ నిధులను ఇతర అవసరాలకు తరలిస్తూ కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో కార్మికులు తమ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.

సింగరేణి సంస్థ ద్వారా వచ్చే లాభాలను, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను చట్టప్రకారం బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. భూపాలపల్లి, కొత్తగూడెం, మంచిర్యాల వంటి ప్రాంతాల ప్రజల తాగునీరు, రోడ్లు, విద్య, వైద్య అవసరాల కోసం ఈ నిధులు వాడాలి. కానీ, గత కేసీఆర్ ప్రభుత్వం ఈ నిధులను సింగరేణి ప్రాంతంలో ఖర్చు చేయకుండా.. కేసీఆర్ కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ వంటి సొంత నియోజకవర్గాలకు చట్టవిరుద్ధంగా మళ్లించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది సింగరేణి ప్రాంత ప్రజలకు చేసిన ద్రోహమని ఆయన అన్నారు.

సింగరేణి సంస్థను మరింత విస్తరించి, లాభాల బాటలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అదనంగా కొత్త కోల్ బ్లాకులను (బొగ్గు గనులు) కేటాయించినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేంద్రం ఇచ్చిన అవకాశాలను బీఆర్ఎస్ సర్కార్ కాలరాసిందన్నారు. పైగా, సింగరేణి సమస్యలు లేదా అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కేసీఆర్ తన పాలనా కాలంలో ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపలేదని కిషన్ రెడ్డి వెల్లడించారు.

కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమే కాకుండా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలన ముగిసే సమయానికి తెలంగాణ జెన్‌కోకు కేవలం రూ.8,958 కోట్ల అప్పులు ఉంటే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొన్ని నెలల్లోనే ఆ అప్పులు ఏకంగా రూ.26,875 కోట్లకు చేరుకున్నాయని అధికారిక గణాంకాలను బయటపెట్టారు. ఈ అప్పులను పూడ్చుకోవడానికి, కొత్తగా అప్పులు తెచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా అధికారులను, కేంద్ర సంస్థలను బెదిరించే స్థాయికి దిగజారిందని కిషన్ రెడ్డి విమర్శించారు.

సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి గనుల్లో నాణ్యమైన బొగ్గు లభించడం లేదని, ఇక్కడి బొగ్గు వాడకం లాభదాయకం కాదంటూ పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి ప్రచారం చేయడం వల్ల సంస్థ ప్రతిష్ట అంతర్జాతీయంగా దెబ్బతింటుందని, ఇది చాలా ప్రమాదకరమైన విషయమని హెచ్చరించారు. సింగరేణి బొగ్గుకు ఎంతో డిమాండ్ ఉందని, కేవలం ప్రభుత్వాల అసమర్థత వల్లే ఈ విధమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని, దీనివల్ల కార్మికుల్లో అభద్రతాభావం పెరుగుతోందని అన్నారు.

సింగరేణి సంస్థ మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించాలంటే కొత్త బొగ్గు గనుల తవ్వకాలు వేగవంతం కావాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ అందుబాటులోకి వస్తే సింగరేణి సంస్థకు భారీగా లాభాలు చేకూరుతాయని, కార్మికుల ఉద్యోగ భద్రతకు ఢోకా ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భరోసా యాత్ర ద్వారా కార్మికుల గొంతుకగా నిలుస్తామని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# తెలంగాణ ప్రగతికి సరికొత్త రెక్కలు

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందించి అధికారులను ఆదేశిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనులను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించాయి. వచ్చే 2028 జూన్ 2 నాటికి, అంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ రెండు విమానాశ్రయాల పనులను వంద శాతం పూర్తి చేసి, అదే రోజు భక్తులు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఒక స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సైతం దీనిపై స్పందిస్తూ.. నిర్దేశిత గడువు లోపే విమానాశ్రయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వరంగల్ (మామునూరు) విమానాశ్రయాన్ని కేవలం ఒక సాధారణ ఎయిర్‌పోర్ట్‌లా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఓరుగల్లు వైభవాన్ని ప్రతిబింబించేలా, కాకతీయ సంస్కృతి, కళాఖండాల ఆకృతులతో ఈ విమానాశ్రయం యొక్క ప్రధాన కట్టడాలను డిజైన్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీనివల్ల వరంగల్ ప్రాంత పర్యాటక రంగానికి, పరిశ్రమల స్థాపనకు సరికొత్త ఊపు వస్తుందని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత రక్షణ రంగానికి (డిఫెన్స్) వ్యూహాత్మకంగా ఆదిలాబాద్ విమానాశ్రయం ఎంతో అవసరమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ ఎయిర్‌పోర్ట్ విస్తరణ మరియు పూర్తి స్థాయి నిర్మాణానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో 1500 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సరిహద్దు జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అటు సైనిక అవసరాలకు, ఇటు వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఎంతో మేలు జరుగుతుందని ఇరుపక్షాలు అభిప్రాయపడ్డాయి.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' నినాదంతో 2045 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుందని, ఇందులో తెలంగాణ భాగస్వామ్యం వహిస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ జనాభాలో కేవలం 2.50 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ, దేశ మొత్తం జీడీపీలో 5 శాతం వాటాను కలిగి ఉండటం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే విమానాశ్రయాల అనుసంధానత చాలా ముఖ్యమని, అందుకే తెలంగాణ జీడీపీ వాటాను 5 శాతం నుండి 10 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించామని సీఎం వివరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ఉడాన్' పథకం కింద దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయాన రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందులో భాగంగానే తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, సాంకేతిక అనుమతులు వేగంగా మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలు ఎలా ఉన్నా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి (ఫెడరల్ స్ఫూర్తి) నిరంతరం కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రాన్ని డిమాండ్ చేసి, ఒప్పించి రాష్ట్రానికి రావలసిన నిధులను, ప్రాజెక్టులను సాధించుకుంటామన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల సమయంలో తాను మళ్లీ ఢిల్లీకి వస్తానని, ఆ సమయంలో మిగిలిన కేంద్ర మంత్రులను కూడా వ్యక్తిగతంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన మరిన్ని అంశాలపై చర్చిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముఖంగా స్పష్టం చేశారు.



# కాళేశ్వరం వైఫల్యం బీఆర్ఎస్ పాపమే

మొదటిపేజీ తరువాయి

చీప్ పాలిటిక్స్ చేస్తున్నాయని తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్న పచ్చి నిజాన్ని ప్రతిపక్షాలు కావాలనే దాస్తున్నాయని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి రావడానికి, పిల్లర్లు కుంగిపోవడానికి పూర్తిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అలసత్వమే కారణమని ఆరోపించారు. నాసిరకం నిర్మాణాలు, ఇంజినీరింగ్ లోపాల వల్లనే ఆ ప్రాజెక్టు దెబ్బతిన్నదని, ఆ పాపాన్ని ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టేందుకు గులాబీ నేతలు ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను, బీఆర్ఎస్ నాయకులు చేసిన మోసాలను తాము ఊరూరా తిరిగి ప్రజలకు వివరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సొమ్మును ఎలా వృథా చేశారో, ప్రాజెక్టు పేరిట ఏ విధంగా దోపిడీకి పాల్పడ్డారో వాస్తవాలతో సహా ప్రతి గ్రామంలోనూ ఎండగడతామన్నారు. ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ప్రతిపక్షాల కుట్రలు ఇకపై సాగవని హెచ్చరించారు.

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తుది నివేదిక వచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపే విషయమై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని మంత్రి వివరించారు. ఎన్‌డీఎస్ఏ నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ప్రాజెక్టు సురక్షితంగా ఉందని చెబితే వెంటనే నీటిని నింపుతామన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, శాస్త్ర సాంకేతిక నిపుణులు, అనుభవజ్ఞులైన ఇంజినీర్లు ఇచ్చే సలహాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా ముందుకు సాగుతామన్నారు. ప్రాజెక్టు మళ్లీ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావడానికి ఏం చేయాలో నిపుణులు సూచిస్తే వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత కరవు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలలో ఆందోళన కలిగించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్ విషయాల్లో కావాలనే రాజకీయం చేస్తూ రచ్చ సృష్టిస్తున్నారని విమర్శించారు. కరవు అనేది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సమస్య అని, దానిని అందరం కలిసి ఎదుర్కోవాలే తప్ప.. శవాల మీద పేలాలు ఏరుకున్న చందంగా రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. ఈ భయంకరమైన ప్రకృతి సవాలును ఎదుర్కోవడానికి ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాల ముందస్తు చర్యలు, నివారణ సూచనలు చేస్తున్నామని వెల్లడించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా నిధులు కేటాయించి పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు. తక్కువ నీటి వనరులతో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రస్తుత నీటి లభ్యత, కరవు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలను పాటించాలన్నారు. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటల సాగు ద్వారా నష్టాల నుంచి బయటపడవచ్చని, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడేలా రైతాంగాన్ని చైతన్యపరుస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల మధ్య అంతర్గతంగా ఎన్ని విభేదాలు, సమస్యలు ఉన్నప్పటికీ.. కరవు వంటి సంక్షోభ సమయాల్లో అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రజలను ఆదుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప.. అనవసరపు రాద్ధాంతం చేయవద్దని హితవు పలికారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని శక్తులతో సిద్ధంగా ఉందని, ప్రజా ప్రయోజనాలే తమ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# 2027 గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తాం..

మొదటిపేజీ తరువాయి

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో మంగళవారం పరిశీలించారు.

**ఘాట్లు, రహదారులు, మౌలిక వసతులపై సమీక్ష**

ఈ సందర్భంగా వీఐపీ, సాధారణ స్నాన ఘాట్లు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అలాగే ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, ఉగ్ర నరసింహస్వామి ఆలయాలు, కోటిలింగాల దేవస్థానం అభివృద్ధి పనులను పరిశీలించి, నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

**రూ.117 కోట్ల నిధులు... అదనంగా మరో ప్రతిపాదనలు**

గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లు కేటాయించగా, ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధి పనులకు తొలి విడతలో రూ.117 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అదనంగా రూ.50-60 కోట్లతో వంతెన నిర్మాణం, ప్రత్యేక వీఐపీ ఘాట్, డబుల్ రోడ్డు వంటి పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు.

**బాసర నుంచి భద్రాచలం వరకు ప్రత్యేక ప్రణాళిక**

బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన పుణ్యక్షేత్రాల అభివృద్ధితో పాటు పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేపడుతున్నామని మంత్రి



తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడంలో ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, ఆర్‌డీఓ మధుసూదన్, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

- **సర్ కేంద్రాల పనితీరును పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి జయసుధ**
- **రుక్మాపూర్, కందనెల్లి గ్రామాల్లో డీపీఓ ఆకస్మిక తనిఖీ**
- **డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశం**
- **బి ఎల్ ఓ లకు పలు సూచనలు చేసిన డీపీఓ**


**పెద్దేముల్, జూలై 14 (ప్రజాక్షేత్రం):**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా సర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఆదేశించారు. మంగళవారం పెద్దేముల్ మండల పరిధిలోని రుక్మాపూర్, కందనెల్లి గ్రామాల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ సెంటర్లను సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి జయసుధ బీఎల్‌వోలు ఇంటింటికీ సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎటువంటి జాప్యం లేకుండా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, నిర్దేశిత గడువులోపు ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకొని, అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి



జయసుధ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిన గడువులోగా సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్, ఎంపీడీఓ కే. తిరుమల స్వామి, ఎంపీఓ రతన్ సింగ్, రుక్మాపూర్ సర్పంచ్ బాల్ రాజ్ , ఉపసర్పంచ్ , కందనెల్లి సర్పంచ్ భూమే యాదమ్మ, ఉపసర్పంచ్ వాజిద్ మియా, ఆయా గ్రామాల బీఎల్‌వోలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# పైల్వాన్ పురం జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించాలి

- **సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి**

**వలిగొండ జూలై 14(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పైల్వాన్పురం, టేకుల సోమారం, రెడ్ల రేపాక గ్రామ ప్రభుత్వ పాఠశాలలను సీపీఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ, పైల్వాన్పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇప్పటికీ ప్రహరీ గోడ లేకపోవడం ఆందోళనకరమని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు టేకుల సోమారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల వద్ద అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ పనులను పూర్తి చేయాలని, విద్యార్థులకు యూనిఫాంలను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రివేళల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పైల్వాన్పురం ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న కోట బురుజుపై తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థుల భద్రతను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చీరక శ్రీశైలం రెడ్డి, బొడ్డుపల్లి బిక్షపతి, చేగూరి నగేష్, రేపాక ముత్యాలు, బందారపు ధనంజయ, వట్టిపల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.






# వలిగొండలో సెక్రటేరియట్ ముట్టడి నేపథ్యంలో ముందస్తు అరెస్టు

**వలిగొండ జూలై 14(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు తలపెట్టిన సెక్రటేరియట్ ముట్టడి నేపథ్యంలో వలిగొండలో ముందస్తు అరెస్టులు కొనసాగాయి. పులిగిల్లకు చెందిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బుగ్గ ఉదయ్ కిరణ్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్య మాలను ఆపలేరని, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.




# కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

- **జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు**
- **భారీగా తరలిరావాలని యువతకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపు**

**కుత్బుల్లాపూర్, జూలై 14 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, యువత హక్కుల కోసం బీఆర్ఎస్ చేపడుతున్న "యువ సంగ్రామ సదస్సు"ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సు ఏర్పాట్లపై పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు.

నిరుద్యోగ యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, ప్రత్యేక యువజన పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, యువత తదితర వర్గాల కోసం ప్రకటించిన 13 డిక్లరేషన్లలోని హామీలు కూడా కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు.

రైతులకు సాగునీరు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఉద్యోగులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశపరిచిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు, ఆటో కార్మికులు, విద్యాసంస్థల యాజమాన్యాలపై ఒత్తిడి, కేసుల బెదిరింపులు పెరిగాయని విమర్శించారు.

ప్రజలు ఇచ్చిన పాలనా కాలంలో సగానికి పైగా గడిచినా ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సంక్షేమ పథకాలను కూడా కొనసాగించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. "కాంగ్రెస్ అంటేనే మోసం - మోసం అంటేనే కాంగ్రెస్" అనే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

యూత్ డిక్లరేషన్ పేరుతో రాష్ట్ర యువతను నమ్మించి మోసం చేసిన ప్రభుత్వాన్ని యువ సంగ్రామ సదస్సు వేదికగా నిలదీస్తామని, హామీల అమలు కోసం ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే యువ సంగ్రామ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి యువత, పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులకు అవార్డులు

**ఉప్పల్, జూలై 14(ప్రజా క్షేత్రం):**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో లోక్ అదాలత్‌లో విశిష్ట పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బందిని ఉప్పల్ డీసీపీ కె. సురేష్‌కుమార్ (ఐపీఎస్) మంగళవారం సత్కరించారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ కె. నర్సింగరావు, కానిస్టేబుళ్లు డి. సంతోష్‌రెడ్డి, డి. అశోక్‌లకు డీసీపీ అవార్డులు అందజేశారు. అదేవిధంగా 14 ద్విచక్ర వాహనాల రికవరీ కేసును విజయవంతంగా ఛేదించిన, కుషాయిగూడ సీ ఐ ఎల్ భాస్కర్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం. విజయ్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ పి. యాదగిరి, కానిస్టేబుళ్లు ఎస్. శ్రీనివాస్, కె. దినేష్, సీహెచ్. మహేష్, మహిళా కానిస్టేబుల్ సౌమ్యలను డీసీపీ ప్రత్యేకంగా అభినందించి అవార్డులతో సత్కరించారు. పోలీసు సిబ్బంది ఇదే నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు.



# శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో డ్రైనేజీ లైన్ నిర్మాణంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కానుంది.

- **శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో డ్రైనేజీ లైన్ నిర్మాణంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కానుంది.**
- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ.**

**శంషాబాద్ జులై14(ప్రజాక్షేత్రం):**

నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సంక్షేమ తన లక్ష్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు.మంగళవారం శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో రూ.23.5 లక్షలతో చేపట్టే డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..నియోజకవర్గం పరిధిలో ఇక్కడ ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులను చేయించడం జరిగిందన్నారు.అదే విధంగా ప్రభుత్వ పథకాలను కూడా అర్హులైన పేదలందరికీ అందించడం జరుగుతుందన్నారు.శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు తన దృష్టికి తేవడంతో వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి ఈ డ్రైనేజీ పైపులైన్ల ఏర్పాటుకు నిధులను మంజూరు చేయించానన్నారు.అయితే ఈ డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఎంతో పట్టుదలతో కృషి చేస్తూ తన దృష్టికి తెచ్చారన్నారు.వెంటనే అధికారులతో మాట్లాడి వీరెన్ని సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించడంతో అధికారులు ఎట్టకేలకు సమస్య పరిష్కారానికి ప్రణాళికను సిద్ధం చేసి తనకు తెలపడంతో అందుకు తగినన్ని నిధులు మంజూరు చేయించానని తెలిపారు.భవిష్యత్తులో కూడా ఈ కాలనీలో ఏ సమస్య ఉన్న వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు కూడా వీకర్ సెక్షన్ కాలనీలో ఏ సమస్య ఉన్నా వాటి పరిష్కారానికి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానికులు విద్యుత్ దీపాలు, విద్యుత్ స్తంభాలు,మరో రెండు చోట్ల సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉందని తెలిపారు.వారి సమస్యలను విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీజీఎం జవహర్ అలీ,మేనేజర్ వెంకటేష్ గౌడ్,గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్,కాంగ్రెస్ నాయకులు ఆర్ శ్రవణ్ కుమార్,స్థానిక నాయకులు డి రమేష్,శివ కుమార్,పురుషోత్తం ,హనుమంత్ రెడ్డి,స్థానికులు బాలు,తరమహా రాజ్,శ్యామ్,అనీల్,ప్రసాద్,తిమ్మన్న,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.







# ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ముప్పు

- **బస్సును తప్పించి లోయలోకి దూసుకెళ్లిన టిప్పర్**

**గిద్దలూరు, జూలై 14(ప్రజా క్షేత్రం):**

నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని శ్రీ సర్వ నరసింహస్వామి క్షేత్రం-పచ్చర్ల గ్రామం మధ్య నల్లమల అరణ్య ప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 60 మంది ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.
నంద్యాల వైపు నుంచి గిద్దలూరు దిశగా వెళ్తున్న టిప్పర్, మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నంద్యాల వైపు వస్తుండగా కల్వర్టు వద్ద ఎదురుపడ్డాయి. బస్సును తప్పించే ప్రయత్నంలో టిప్పర్ అదుపు తప్పి ముందుగా కల్వర్టును ఢీకొట్టి అనంతరం లోయలోకి దూసుకెళ్లింది.
ప్రమాదంలో టిప్పర్ పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. బస్సులోని సుమారు 60 మంది ప్రయాణికులు క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఘటనతో కొంతసేపు ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# టీబీ రోగులకు అండగా ప్రసాద్ హాస్పిటల్

- **50 మంది క్షయ రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ**

**కూకట్‌పల్లి, జూలై 14(ప్రజా క్షేత్రం):**

క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం ఎంతో అవసరమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె. ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని శివానంద రిహాబిలిటేషన్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 50 మంది క్షయ రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ప్రసాద్ హాస్పిటల్ యాజమాన్యం తరపున డాక్టర్ సుమా ప్రసాద్ నిక్షయ్ మిత్రగా ఈ పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న క్షయ మందులను క్రమం తప్పకుండా తీసుకుంటూ, పోషకాహారం కూడా తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పూర్తి చికిత్స పొందితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని రోగులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# అమావాస్య అన్నదానానికి విశేష స్పందన

- **జమ్మిగడ్డ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం**

**కాప్రా, జూలై 14(ప్రజా క్షేత్రం):**

జమ్మిగడ్డ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. సంఘ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంఘ సభ్యులతో కలిసి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సేవా కార్యక్రమాలకు ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని సంఘ సభ్యులు పేర్కొన్నారు. ప్రతి నెల అమావాస్య రోజున ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సమాజ సేవలో భాగస్వాములవుతున్న సంఘ సభ్యులను పలువురు అభినందించారు. "అన్నదానం మహాదానం" అనే భావనతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.





# ఎస్సైని సన్మానించిన ముదిరాజ్ సంఘం నాయకులు

**కోటగిరి,జులై 14(ప్రజాక్షేత్రం):**

కోటగిరి ఎస్ఐ శ్రీనివాస్ ను కొత్తపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామంలోని పరిస్థితులను ఎస్ఐకి వివరించిన నాయకులు గ్రామంలో ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా కోటగిరి పోలీసు శాఖ ద్వారా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి డైరెక్టర్ కోటగిరి సుదర్శన్,సహకార సంఘ మాజీ చైర్మన్ వెల్లంకి నారాయణరావు, ముదిరాజ్ సంఘం నాయకులు సాలూరి పెద్ద రాజన్న, పుప్పల సైదయ్య,ఇట్టే గంగారాం,సతీష్, గణేష్, చలపతిరావు,మురళి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బానోతు రూప్ సింగ్

**కొత్తగూడ జులై 14( ప్రజాక్షేత్రం ):**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బానోతు రూప్ సింగ్‌ను నియమిస్తూ మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమా మురళి నాయక్ మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు.
రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కఆదేశాల మేరకు, పార్టీ అధిష్టానం ఈ నియామకాన్ని చేపట్టినట్లు జిల్లా పార్టీ వర్గాలు తెలిపాయి.
తనపై నమ్మకంతో మండల బాధ్యతలను అప్పగించిన మంత్రి సీతక్కకు, జిల్లా అధ్యక్షులు ఉమా మురళి నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడ మండలంలో పార్టీని మరింత



బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యలపై పోరాడేందుకు అందరిని కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రూప్ సింగ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను సన్మానించిన బేగరి రాజు

**మహేశ్వరం జులై.14 (ప్రజాక్షేత్రం):**

దళిత గిరిజనుల సమస్యలు పరిష్కారం కోసం వారిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఉద్దేశంతో 1995లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు సోమవారం నాడు హైదరాబాద్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేయడం జరిగిందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్& మానిటరింగ్ కమిటీ రంగారెడ్డి జిల్లా మెంబర్ బేగరి రాజు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దళిత ఆదివాసుల పైన అత్యాచారాలు, మానభంగాలు మడర్లు రోజుకు ఏదో ఒకచోట ఒకటి లేదా రెండు జరుగుతున్నాయని అలాంటివి జరగకుండా రాష్ట్రంలో జిల్లాల్లో ప్రత్యేకంగా ఒక కమిటీ నియమించి పరిష్కారం దిశగా ఉండాలని ఉద్దేశంతో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీకి రంగారెడ్డి జిల్లా మెంబెర్ గా ఎన్నికైనందుకు బేగరి రాజును ప్రత్యేకంగా అభినందించిన ఈ కార్యక్రమంలో దళిత సేన జాతీయ అధ్యక్షులు జె.బి రాజు, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మయ్య, జిల్లా శంకర్, రాంబాబు నాయక్, అలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్,అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్,జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ మెంబర్ యాదగిరి,రాజేష్,ఇమ్మల్ పాల్గొన్నారు.



# మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జాతీయ నూలు పురుగుల నిర్మూలన కార్యక్రమం

- **బీసీ గురుకులంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**

**మహేశ్వరం జూలై.14 (ప్రజాక్షేత్రం):**

జాతీయ నూలు పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ,కందుకూరు మండలం, బైరాయిగూడ గ్రామంలోని నిషిత క్యాంపస్ లో చంద్రాయన గుట్ట ,కందుకూరు , రాజేంద్రనగర్ కార్వాన్ బాయ్స్ విద్యార్థులకు సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దీప చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లేమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మాట్లాడుతూ, ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తోందని తెలిపారు. నూలు పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదలలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ మాత్రలను తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టాఫ్ నర్స్ లు వైద్యులు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు నూలు పురుగుల నివారణపై అవగాహన కల్పించి, ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.



# వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహించిన శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**మహబూబ్ నగర్ జిల్లా,జూలై 14 (ప్రజా-క్షేత్రం):**

గద్వాల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో అనంతరం నిర్వహించిన సభలో గౌరవ ఉప ముఖ్య మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు వాకిటి. శ్రీహరి నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి టీజీఎస్ జిడిసిఎఫ్ఎల్ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.ఎ సంపత్ తో కలిసి పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మరియు అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

**నర్సంపేట జూలై 14(ప్రజాక్షేత్రం):**

నర్సంపేట మున్సిపాలిటీకి చెందిన మహేశ్వరం 15వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను స్థానిక కౌన్సిలర్ ఏపూరి శ్రీనివాస్ రెడ్డి మరియు కమిషనర్ కాటం భాస్కర్ తో కలిసి పరిశీలించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందని దానితో పాటుగా వార్డు డంపింగ్ యార్డ్ కొరకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,వార్డు ప్రజలు, పాల్గొన్నారు.




## పెద్దపల్లి జిల్లాలో ఏసీబీ కి చిక్కిన ఏఈ

**పెద్దపల్లి,జులై 14(ప్రజాక్షేత్రం):**

పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సంచలన దాడి చేశారు. పెద్దపల్లి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ సతీష్ లంచం తీసుకుం టుండగా ఏసీబీ అధికారులు మంగళ వారం మెరుపు దాడు లుచేసిరెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మున్సిపల్ పరిధిలో జరిగిన పనుల బిల్లును విడుదల చేయడానికి కాంట్రాక్టర్ బత్తుల శ్రీను నుండి 2 లక్షల రూపాయల లంచం డిమాండ్ చేసి డబ్బులు తీసుకుంటు న్న సమయంలోనే ఏసీబీ అధికారులు ఆయనను పట్టు కున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేం దర్ రెడ్డి,తో పాటు ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ముందు గా మున్సిపల్ ఏఈ సతీష్ ను ఆయన ఇంటి వద్ద పట్టుకున్న అధికారులు, అనంత రం విచారణ కోసం మున్సిపల్ కార్యాల యానికి తీసుకెళ్లారు. అక్కడ రికార్డులను కూడా పరిశీలిస్తున్నారు. ఈ ఘటనతో పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో కలకలం రేగింది. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

## అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య బాధ్యతలు స్వీకరణ.

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేసి,స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

**- శంషాబాద్ (ప్రజాక్షేత్రం):**




## విద్యార్థుల భవిష్యత్తును బందీ చేయొద్దు ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కో-కన్వీనర్ బుదారి గంగాప్రసాద్

**నిర్మల్ జిల్లా జూలై 14(ప్రజాక్షేత్రం):**

రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైన కళాశాలల బంద్.. రూ.11 వేల కోట్ల బకాయిల విడుదలకు ఏబీవీపీ డిమాండ్ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. పలు జిల్లాల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించగా, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కోకన్వీనర్ బుదారి గంగా ప్రసాద్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఈ పథకంపై ఆధారపడి చదువుకుంటుండగా, ప్రభుత్వం నిర్లక్ష్యంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన రూ.11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, వాటిని విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది వేలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.



# గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- **ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దేముల్ ఎస్సీ గురుకుల పాఠశాల సందర్శన**
- **640 మంది విద్యార్థులకు అద్దె భవనమే ఆశ్రయం**
- **బోటనీ, కెమిస్ట్రీ, తెలుగు అధ్యాపకుల కొరత**
- **బాత్రూమ్ లు , డైనింగ్ హాల్, ఆటస్థలం కొరత**
- **సమస్యల వలయంలో పెద్దేముల్ ఎస్సీ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల**
- **విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని- ప్రజా సంఘాల డిమాండ్**

**పెద్దేముల్,జూలై 13 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ ఎస్సీ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కెవిపీఎస్,టీఎస్ ఎంహెచ్పీఎస్, ఎమ్మార్పీఎస్ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం ప్రజాసంఘాల ప్రతినిధులు పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కెవిపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, టీఎస్ ఎంహెచ్పీఎస్ తాండూరు నియోజకవర్గ ఇంచార్జి ఎండీ.సాధిక్ మాట్లాడుతూ...గత వారం నుంచి పెద్దేముల్ ఎస్సీ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న అన్నంలో తెల్ల పురుగులు వస్తుండటంతో వారు భోజనం చేయలేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.అలాగే ఇంటర్ విద్యార్థులకు బోటనీ, కెమిస్ట్రీ, తెలుగు సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతోందని తెలిపారు.ప్రభుత్వం ఇప్పటివరకు ఏకరూప దుస్తులు (యూనిఫారం)అందించలేదని, 640 మంది విద్యార్థులు అద్దె భవనంలోనే చదువుకుంటుండటంతో బాత్రూములు, డైనింగ్ హాల్, ఆట స్థలం వంటి మౌలిక సదుపాయాలు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోడంగల్ నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలకు కొత్త భవనాలు



నిర్మిస్తూనే,వికారాబాద్ జిల్లాలోని ఇతర నియోజకవర్గాల గురుకుల పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల గురుకుల పాఠశాలల్లో సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

పెద్దేముల్ ఎస్సీ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించి,అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల నియామకం,నాణ్యమైన భోజనం , యూనిఫారాల పంపిణీ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కెవిపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మహేందర్,కెవిపీఎస్ నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.





## బైండ్ల విజయ్ కుమార్‌కు ప్రముఖ నేతల జన్మదిన శుభాకాంక్షలు

**వికారాబాద్, జూలై 14(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి, అసెంబ్లీలో ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ టి.హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలను విజయ్ కుమార్ కలిశారు.ఈ సందర్భంగా వారు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి,ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం బైండ్ల విజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై చూపుతున్న అభిమానానికి, ఆశీస్సులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, విజయ్ కుమార్




జన్మదిన వేడుకలను వికారాబాద్ జిల్లాలోని పలుచోట్ల అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన సబితా ఇంద్రా రెడ్డి.

**మహేశ్వరం జూలై.14 (ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని జల్‌పల్లి మరియు బడంగ్‌పేట్ సర్కిళ్లలో మంజూరైన కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మాజీ మంత్రివర్యులు,డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే మహోన్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకాలు వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని పేర్కొన్నారు.

అలాగే,ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం కూడా అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందని,అయితే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఆ హామీ అమలు కాలేదని ఆమె విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది

- **బీఎల్ఓ కు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. మహిపాల్ రెడ్డి**

**పెద్దేముల్, జూలై 14(ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి అన్నారు.మంగళవారం పెద్దేముల్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో కొనసాగుతున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతోంది.ఈ సందర్భంగా 2002 ఓటరు మ్యాపింగ్ ఆధారంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి, ఆయన కుమారుడు పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి సంబంధిత బీఎల్‌వో (జీపీఓ)హరిత,బీఎల్ఏ లకు అందజేశారు.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని, ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా తమ వివరాలను సరిచూసుకొని ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను బాధ్యతగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్‌వో హరిత, బీఎల్ఏతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## నేడు కోటగిరి లో రైతు మహా ధర్నా

- **పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్**

**కోటగిరి,జులై 14(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలో బుధవారం భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో రైతుల మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ఎలమంచిలి శ్రీనివాస రావు తెలిపారు.మంగళవారం కోటగిరి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు... నిజాంసాగర్ లో ఉన్న నీటిని తక్షణమే విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు. కాళేశ్వరం కన్నేపల్లి ఎత్తిపోతలను ప్రారంభించి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ కు నీటిని తరలించాలని డిమాండ్ చేశారు.గతంలో హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ కు అర టీఎంసీ నీటిని తీసుకొని వస్తే క్షీరాభిషేకాలు చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఇప్పుడు ఎందుకు నోరు విప్పడం లేదు అని ఆయన ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ లో ఉండగా అప్పటి ప్రభుత్వం అర టీఎంసీ నీటిని తీసుకొని వస్తే కాళేశ్వరం ప్రపంచంలో గొప్ప ప్రాజెక్టు అని చెప్పిన పోచారం ఇప్పుడు కాళేశ్వరంపై ఎందుకు నోరు విప్పడం లేదని నిలదీశారు. నియోజకవర్గ ప్రజలు రైతులు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి పోచారం శ్రీనివాస్ రెడ్డిని గెలిపిస్తే ఆయన కాంగ్రెస్ లో చేరడం సిగ్గుచేటు అన్నారు. ఆయన రైతుల కోసం నియోజకవర్గ ప్రజల కోసం కాంగ్రెస్ లో చేరాను అని చెబుతున్నారని ఇప్పుడు రైతుల కోసం నోరు విప్పాలని కోరారు. నిజాంసాగర్ ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. రైతుల కోసం ప్రతిపక్ష పార్టీగా బి.ఆర్.ఎస్ పార్టీ చేపడుతున్న రైతు మహాధర్నాలో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ విజి.గౌడ్, రాష్ట్ర పరిశీలకులు ఆగన్న, నియోజకవర్గ ముఖ్య నాయకులు రానున్నందున నియోజకవర్గంలోని రైతులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మోరే కిషన్, తేల్ల రవికుమార్, సూధం నవీన్, గంగా ప్రసాద్ గౌడ్, వడ్ల ఉమాకాంత్, సందీప్, మంజునాథ్, మేత్రి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.





## పైల్వాన్ పురం జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించాలి

- **సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి**

**వలిగొండ జూలై 14(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పైల్వాన్పురం, టేకుల సోమారం, రెడ్ల రేపాక గ్రామ ప్రభుత్వ పాఠశాలలను సీపీఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ, పైల్వాన్పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇప్పటికీ ప్రహరీ గోడ లేకపోవడం ఆందోళనకరమని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు టేకుల సోమారం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల వద్ద అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ పనులను పూర్తి చేయాలని, విద్యార్థులకు యూనిఫాంలను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రివేళల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పైల్వాన్పురం ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న కోట బురుజుపై తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థుల భద్రతను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చీరక శ్రీశైలం రెడ్డి, బొడ్డుపల్లి బిక్షపతి, చేగూరి నగేష్, రేపాక ముత్యాలు, బందారపు ధనంజయ,వట్టిపల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలి..

- **నర్కూడ బిజెపి యువ నాయకుడు కమ్మరి ప్రకాష్ చారి**
- **ఎన్యుమరేషన్ ఫామ్ తప్పనిసరిగా సమర్పించాలి**

**శంషాబాద్ జూలై14(ప్రజాక్షేత్రం):**



ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు కాపాడుకోవాలని ఎన్యుమరేషన్ ఫారమ్‌లను (బిఎల్ఓ) అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని నర్కూడ బిజెపి యువ నాయకుడు కమ్మరి ప్రకాష్ చారి అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవడం తమ బాధ్యతగా భావించాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను నింపి (బిఎల్ఓ) అధికారులకు సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడానికి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పోలీసుల నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరు

- **ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్**

**చేవెళ్ల/మొయినాబాద్,జులై 14(ప్రజాక్షేత్రం):**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సాగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాలను అక్రమ అరెస్టులు, పోలీసు నిర్బంధాలతో అణచివేయాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. 'చలో సెక్రటేరియట్' కార్యక్రమానికి వెళ్లకుండా తనను తెల్లవారుజామునే ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని తెలియజేస్తోందన్నారు. విద్యార్థి నాయకులను అక్రమంగా నిర్బంధించడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు. ప్రభుత్వాలు ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా, నిర్బంధాలు విధించినా విద్యార్థి సమస్యలపై పోరాటాన్ని ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి, విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం ఎస్ఎఫ్ఐ శ్రేణులు మరింత బలంగా ఉద్యమిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్, మణి గౌడ్,మాల చందు తదితరులు పాల్గొన్నారు.




# సిద్ధాపూర్" నమ్మలేని నిజాలు..!

- **మొదలుపెట్టింది బిఆర్ఎస్ - కొనసాగిస్తుంది కాంగ్రెస్**
- **అధికార పార్టీయే రోడ్డెక్కిన వేళ..**
- **ప్రభుత్వాన్ని దోషిని చేసేందుకు బిఆర్ఎస్" పోరాటం**
- **ఎమ్మెల్యేతో సహా ప్రతిపక్ష నేతలందరూ సిద్ధాపూర్ బాధితులే..**
- **దంపుయార్డు నిర్ణయంతో కాంగ్రెస్ లో అలజడి..**
- **ఎట్టి పరిస్థితులను వద్దంటూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన..**
- **ప్రభుత్వం దిగి వస్తుందా..?**
- **ఓవైపు బిఆర్ఎస్ - మరోవైపు బిజెపి పార్టీల నిరంతర ఆందోళనలు**
- **కాలుష్యకార పరిశ్రమలను సిద్ధాపూర్ లో పెట్టాలని ఉత్తర్వులు ఇచ్చిన వారు ఎవరు..?**
- **2018లో వచ్చిన జీవో మాట ఏమిటి..?**
- **2026లో తదుపరి జీవో సంగతేంటి..**

**వికారాబాద్ జూలై 14(ప్రజాక్షేత్రం):**





సాధారణంగా ప్రభుత్వాలు పాలిస్తుంటాయి.. ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుంటాయి..కానీ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం రూటే వేరు.. ఇక్కడ గత ప్రభుత్వంతోపాటు నేటి ప్రభుత్వం ఇచ్చిన ఊహించని షాక్, ఊహకందని జీవోలతో ఈ ప్రాంతం ఉలిక్కిపడుతుంది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బిజెపి, ఇతర పార్టీలు ఆందోళన చేపడుతున్నాయి అంటే అర్థం ఉంది.. మరి కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీ సైతం కూడా రోడ్డుపై ఆందోళనకు దిగింది అంటే ? అర్థం ఏంటి..? సమస్య ఎవరు మొదలుపెట్టారు ఎక్కడ ముగించాలి..? సిద్ధాపూర్ పై నమ్మలేని నిజాలు ప్రజలు తెలుసుకోవాల్సి ఉంది. ఎవరు సిద్ధాపూర్ పై పగబెట్టారు ఎవరు కరుణిస్తున్నారు. వీటికంతటికి కారణం ఎవరు..? అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు జబ్బలు చరుచుకుంటూ సిద్ధాపూర్ డంప్ యార్డ్ వద్దు అంటూ రోడ్డుపైకి ఆందోళనకు రావడం పోలీసులు వారిని వారించడం, అదుపులోకి తీసుకోవడం ఇలాంటి చర్యలు దేనికి సంకేతాలుగా పరిగణించవచ్చు. కాంగ్రెస్ వర్గాలు ప్రభుత్వం పైనే ఎదురుదాడికి దిగాయి.. ఎమ్మెల్యేతో సహా నాయకులు ఆందోళనలో పడడమే కాకుండా ప్రతిపక్షాలకు దీటుగా సమాధానం చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రజల ఒత్తిడి భవిష్యత్ రాజకీయాల దృశ్యా వాళ్ళు కూడా ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో జీవో 641 ద్వారా ఎకో టౌన్, లేదా డంప్ యార్డ్ ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం. దీనివల్ల అధికార కాంగ్రెస్ పార్టీకి పట్టు ఉన్న కొత్తూరు, నందిగామ ప్రాంతాలలో నియోజకవర్గంలో వ్యతిరేకత వచ్చే పరిస్థితి ఉండడంతో కాంగ్రెస్ నాయకులు రంగంలోకి దిగారు. సిద్ధాపూర్ భూములలో డంప్ యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీయే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు పూనుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిందనీ రాజకీయ విశ్లేషకులు ప్రజలు అంటున్నారు. ఇలాంటి కష్టం ఏ అధికార పార్టీకి కూడా రాకూడదని రాజకీయ మేధావులు అభిప్రాయపడుతున్నారు.

**ఎందుకీ పరిస్థితి..?**

సిద్ధాపూర్ వ్యవహారంపై కొన్ని నమ్మలేని నిజాలు నమ్మి తీరాల్సిందే.. ఎవరు చెప్పినా కాకమ్మ కహానీలు కాకుండా వాస్తవంగా ఆయా ప్రభుత్వాలు ఎలాంటి జీవోలు ఇచ్చాయి ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నాయి వాటి లోతుల్లోకి కూడా వెళ్లి పరిశీలించాల్సిన అవసరం ఉంది. సిద్ధాపూర్ లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ప్రగతి కోసం రైతుల నుంచి భూములు సేకరించి పెట్టారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు వెలుపల కాలుష్య పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు 2018లో జీవో ఇచ్చిన మాట వాస్తవం. అప్పటి సంబంధిత అధికారులు దీనికి సంబంధించిన ఉత్తర్వులను కూడా సంబంధిత శాఖలకు జారీ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సిద్ధాపూర్ భూములను కాలుష్యకర పరిశ్రమలకు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా ఇప్పుడు వెలుగుచూస్తున్నాయి. సిద్ధాపూర్ వ్యవహారాన్ని రాజకీయ కోణంతో కాకుండా సామాజిక కోణంతో ఆయా పార్టీలు చూస్తే ఈ తంటా ఉండదు. ఎవరి ప్రాబ్లం కోసం వాళ్లు డంపింగ్ యార్డ్ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకొని డ్రామాలు చేస్తున్నారని మరికొందరు అంటున్నారు. రాజకీయ అంశంగా పరిగణించకుండా సామాజిక అంశంగా చూసి ఎవరి హయాంలో ఏం జరిగింది అసలు సిద్ధాపూర్ ప్రాంతాన్ని మొదట ఎవరు కాలుష్యకార పరిశ్రమల కోసం ఎంపిక చేశారు అన్న ప్రధానాంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది.

**ఆనాటి ప్రభుత్వంలో ఈ అంశంలో ఏం చెప్పారంటే..?**

సిద్ధాపూర్ భూములు కాలుష్య పరిశ్రమల తరలింపుకే..!

2018లో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీఎస్ఐఐసీ పత్రాలతో వెలుగులోకి కీలక వివరాలు ఓసారి పరిశీలిస్తే..

ఓఆర్ఆర్ వెలుపల కాలుష్య పరిశ్రమల ఏర్పాటుకు 233.10 ఎకరాల భూ సేకరణ ప్రతిపాదన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను పరిశ్రమల పార్కు కోసం సేకరించాలన్న ప్రతిపాదన వెనుక అసలు ఉద్దేశం కాలుష్య పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెలుపలికి తరలించడమేనని 2018 నాటి టీఎస్ఐఐసీ అధికారిక పత్రాలు వెల్లడిస్తున్నాయి. 2018 జూలై 24న టీఎస్ఐఐసీ ల్యాండ్స్ వింగ్ విడుదల చేసిన ఇంటర్ ఆఫీస్ మెమోతో పాటు జోనల్ మేనేజర్ డి.రవి జిల్లా కలెక్టర్‌కు పంపిన ఫారంబీ పత్రంలో, సిద్ధాపూర్ గ్రామ సర్వే నంబర్లు 361, 252, 278లో మొత్తం 233 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ, అసైన్డ్ భూమిని పరిశ్రమల పార్కు కోసం సేకరించాలని కోరారు.

ఈ పత్రాల్లో (ఓఆర్ఆర్ వెలుపల కాలుష్య పరిశ్రమలను తరలించడం) అనే ఉద్దేశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఇందుకోసం భూమి గుర్తింపు పూర్తయిందని, భూ సేకరణ ప్రక్రియను తెలంగాణ భూ సేకరణ చట్టం-2017 ప్రకారం వేగవంతం చేయాలని అప్పటి జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే పరిశ్రమల ప్రాజెక్టును భూ సేకరణ చట్టంలోని కొన్ని నిబంధనల నుంచి మినహాయించాలని ప్రభుత్వం పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖకు 2018 జూలై 23న లేఖ రాసినట్లు కూడా పత్రాల్లో ప్రస్తావించారు.

**ఇక వీటికి జత చేసిన వివరాల ప్రకారం..**

సిద్ధాపూర్ తదితర గ్రామాల పరిధిలో మొత్తం 330.34 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా, అందులో 233.10 ఎకరాలు అసైన్డ్ భూమి, 97.24 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ అధికారిక పత్రాలు వెలుగులోకి రావడంతో సిద్ధాపూర్ భూముల సేకరణ ప్రతిపాదన, కాలుష్య పరిశ్రమల తరలింపు అంశంపై నమ్మలేని నిజాలు వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం ఈ వెలుగు చూసిన పత్రాలకు సంబంధించిన తాజా పరిస్థితులపై స్థానిక ప్రజలు, రైతులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

**సిద్ధాపూర్‌లో 233.10 ఎకరాల భూ సేకరణకు టీఎస్ఐఐసీ ప్రతిపాదనకు మరో లేఖ..**

2018 లేఖ వెలుగులోకి పరిశ్రమల పార్కు ఏర్పాటుకు కలెక్టర్‌కు టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ ప్రతిపాదన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో పరిశ్రమల పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వ/అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించిన 2018 నాటి టీఎస్ఐఐసీ అధికారిక లేఖ మరొకటి కూడా వెలుగులోకి వచ్చింది. 2018 ఆగస్టు 9 తేదీతో టీఎస్ఐఐసీ శంషాబాద్ జోన్ జోనల్ మేనేజర్ డి. రవి, అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపిన లేఖలో సిద్ధాపూర్ గ్రామ సర్వే నంబర్లు 361, 252, 278లో మొత్తం 233 ఎకరాలు 10 గుంటల ప్రభుత్వ/అసైన్డ్ భూమిని పరిశ్రమల పార్కు స్థాపన కోసం సేకరించాలని ప్రతిపాదించారు.

తెలంగాణ రాష్ట్ర భూ సేకరణ (కన్సెంట్ అవార్డు, స్వచ్ఛంద భూ సేకరణ, పునరావాసం మరియు పునరుద్ధరణ) నిబంధనలు-2017 ప్రకారం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని లేఖలో కలెక్టర్‌ను కోరారు. ఇందుకు సంబంధించిన ఫారం-బి, స్కెచ్‌లు, అనుబంధ పత్రాలను కూడా జత చేసినట్లు పేర్కొన్నారు.

అలాగే ఈ లేఖ ప్రతులను పునరావాస కమిషనర్, టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, షాద్‌నగర్ ఆర్డీవో, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ), కొత్తూరు తహసీల్దార్ తదితర అధికారులకు సమాచారం కోసం పంపినట్లు లేఖలో వివరించారు. ఈ పత్రం వెలుగులోకి రావడంతో సిద్ధాపూర్ ప్రాంతంలో కాలుష్యకర పరిశ్రమల ఏర్పాటుకు భూ సేకరణ చేపట్టాలని ఈ లేఖ సారాంశం.

**ఇక ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 641 జీవో వీటికి అనుసంధానం చేస్తూ ఇచ్చారు. గతంలో వచ్చిన మొదటి జీవో ఆ తదుపరి ఉత్తర్వులు వీటికి సంబంధించిన మొత్తం లింకులు బయటపెడితే సిద్ధాపూర్ కు ద్రోహం చేసింది అసలు ఎవరో వేరేగా చెప్పనక్కర్లేదు. ముందుగా కాలుష్యకర పరిశ్రమలను సిద్ధపూర్ లో ఏర్పాటు చేయాలని శ్రీకరం చుట్టింది టిఆర్ఎస్ పార్టీ అయితే దానిని 641 జీవోతో కొనసాగించింది కాంగ్రెస్. ఇక ఈ రెండు పార్టీలు దొందు దొందేనని ఆరాటపడుతున్నది బిజెపి. ప్రజలు మాత్రం ఎవరు సహాయం చేస్తారని అన్ని పార్టీల నాయకులను బ్రతిమలాడుతూ అందరూ పిలిచిన ఆందోళనలకు హాజరవుతూ న్యాయం కోసం ప్రశ్నిస్తున్నారు. సిద్ధాపూర్ వ్యవహారంలో నమ్మలేని నిజాలు ఈ విధంగా ఉన్నాయి.**

**ఇకపోతే...**

రాజధానిలో అక్కడ పారిశ్రామిక ప్రగతి లేకపోగా జవహర్ నగర్ కు సంబంధించిన చెత్తని ఇక్కడికి తెచ్చి రీసైక్లింగ్ చేస్తామని చెప్తుండడంతో దీనివల్ల ఇక్కడ వ్యవసాయానికి కాలుష్యక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండడం, రియల్ ఎస్టేట్ లలో అగ్రగామిగా ఉన్న కొత్తూరు, నందిగామ, షాద్ నగర్ మండలాలలో భూముల ధరలు పడిపోయే అవకాశం ఉండడంతో పాటు వ్యవసాయం ఆగమైపోతుంది, ప్రజల ఆరోగ్యాలు నాశనం అవుతాయి, అన్నింటికీ మించి ఈ ప్రాంత అభివృద్ధి పాతాళానికి వెళుతుందనే ఆందోళన రోజు రోజుకు ఉత్కృతం అవుతుంది. ఈ నేపథ్యంలోనే అక్కడి ప్రజలకు మద్దతుగా కాంగ్రెస్, ప్రతిపక్షాల నాయకులు కూడా ఆందోళనకు ముందుకు రావడం, మీ ప్రభుత్వం చేసింది అంటే కాదు మీ ప్రభుత్వం చేసింది అంటూ అన్ని పక్షాలు ప్రస్తుత ప్రభుత్వంతోనే పోరాటానికి దిగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మరి ఈ పోరాటం ఎక్కడి దాకా వెళుతుంది..? డంప్ యార్డ్ సమస్యకు పరిష్కారాన్ని చూపగలుగుతుందా.. అన్నది వేచి చూడాలి. ఇప్పుడు చెప్పండి అధికారులు ఏం చేయాలి.. ప్రజలు ఏం చేయాలి నాయకులు ఏం చేయాలి..?

## స్టైపెండ్ ఇవ్వరా వసతులు కల్పించరా?

**చేవెళ్ల/మొయినాబాద్,జులై 14(ప్రజాక్షేత్రం):**

మహేందర్ రెడ్డి మెడికల్ కాలేజీలో స్టైపెండ్ చెల్లింపులు, మౌలిక వసతుల లేమిపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. గత పది రోజులుగా తమ సమస్యలను కాలేజీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఎలాంటి స్పందన లేదని విద్యార్థులు ఆరోపించారు. స్టైపెండ్ చెల్లించకపోవడంతో పాటు తాగునీరు, హాస్టల్ సౌకర్యాలు, ఇతర కనీస మౌలిక వసతులు కూడా సరిగా కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## భారీ మొత్తంలో గంజాయి పట్టివేత

- **20.898 కిలోల గంజాయి స్వాధీనం.**
- **ఇద్దరు అరెస్ట్**
- **నిషేధిత అక్రమ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు - సీఐ వినయ్ కుమార్**

**గూడూరు జూలై 14 (ప్రజాక్షేత్రం):**



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో పోలీసులు భారీ గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.10.44 లక్షల విలువైన 20.898 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు గూడూరు ఎస్.ఐ. బి. గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బ్రాహ్మణపల్లి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు బ్యాగుల్లో తరలిస్తున్న 20.898 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఒడిశా రాష్ట్రంలోని బెరహంపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి సూరత్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయితో పాటు మూడు బ్యాగులు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, నిందితుల పై ఎన్ డి పి ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏసీబీ వలలో మున్సిపల్ ఏఈ

- రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- సోదాల్లో రూ.32 లక్షలు స్వాధీనం




**కరీంనగర్,జూలై 14 (ప్రజాక్షేత్రం):**

పెద్దపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సతీష్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనుల బిల్లులు మంజూరు చేసేందుకు కాంట్రాక్టర్ బత్తుల శ్రీను నుంచి రూ.4.50 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తొలి విడతగా రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో రూ.32 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ దాడుల్లో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.




# ప్రతిభా పురస్కారాల్ని అందించిన రమణబాబు

**భద్రాచలం,జూలై14(ప్రజాక్షేత్రం):**

క్రమశిక్షణ,సత్ప్రవర్తన విద్యార్థి దశలో ఎంతో అవసరమని వాటి సహాయం తో భవిష్యత్ లో చక్కని స్థానానికి చేరుకోవచ్చని పి.ఎం.శ్రీ. ఎస్.ఎన్.ఎం. జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు కొనకంచి శ్రీనివాసరావు అన్నారు. పేద విద్యార్థుల్ని ఆదుకోవడానికి ఆనంద నిలయం సంస్థ చేస్తున్న సేవలు చాలా గొప్పవని కూడా ఆయన అన్నారు. గత ఏడాది పదవ తరగతి లో పాఠశాల స్థాయి లో ఎక్కువ మార్కులు సాధించిన భరత్,చరణ్ అనే విద్యార్థులకు చెరొక అయిదు వేల రూపాయల చొప్పున దాత కె.వి.రమణబాబు ఈ కార్యక్రమం లో అందించారు. ప్రతి ఏడాది తెలివైన చురుకైన విద్యార్థులను ప్రోత్సహించడానికి గాను తమ తల్లిదండ్రులైన వీర రాఘవయ్య మరియు సత్యవతి పేరు మీద ఈ వితరణ చేస్తున్నామని,రానున్న రోజుల్లో ఇంకా విస్తరిస్తామని కనుక విద్యార్థులు మంచిగా చదువుకోవాలని రమణ బాబు చెప్పారు. చిన్నతనం నుంచే పిల్లలు ధ్యానం చేయడం నేర్చుకోవాలని ,దానివల్ల ఏకాగ్రత పెరుగుతుందని మాజీ పౌర సంబంధాల అధికారి వీరయ్య తెలిపారు. చెడు అలవాట్ల కి దూరం గా ఉండాలని,ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని మాజీ పోలీసు అధికారి రామకృష్ణ ఉద్బోధించారు. చివరిగా దాత కె.వి.రమణ బాబు ని బోధన,బోధనేతర సిబ్బంది శాలువ తోసన్మానించారు.ఈ ప్రతిభా పురస్కారాల కార్యక్రమం లో రామరాజు, సత్యవతి పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడారు. తన్నీరు శ్రీనివాసరావు,పి.వి.రమణ,కల్లం సత్యనారాయణ,భారతి,హామీదా బేగం,వీరమ్మ,కృష్ణవేణి,మంజుల,ఆదినారాయణ,పటేల్,ధనికొండ శ్రీనివాసరావు,రేసు వెంకటేశ్వర్లు,బాలకృష్ణ,పాషా తదితరులు ఫాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి

- 80 శాతం నమోదు పూర్తి చేసిన బూత్ స్థాయి అధికారులకు
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానం

**వనపర్తి,జులై 14 (ప్రజాక్షేత్రం):**

సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో మంగళవారం బూత్ స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, ఓటరు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రజల సహకారం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**బూత్ స్థాయి అధికారుల సేవలు అభినందనీయం**

ఇప్పటికే దాదాపు 80 శాతం నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బూత్ స్థాయి అధికారుల పనితీరును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఓటరు జాబితా సవరణలో వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడుతూ, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

**ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి**

ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడం ప్రజాస్వామ్య పరిరక్షణకు అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే బూత్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మిగిలిన నమోదు ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమోద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాపర్ల రాంరెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి,సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్,యుగేందర్ రెడ్డి, పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు,బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

- మెట్ట పంట పొలాలకు ఎకరాకు 8 వేయిలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి
- జాయింట్ కలెక్టర్ వెంకటాచారి కి మెమోరండం
- కలెక్టరేట్ కార్యాలయం ముందు రైతు సంఘం ధర్నా
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ

**వికారాబాద్ జూలై 14(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లాలోని అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ కు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశ్య పద్మ మాట్లాడుతూ ఎల్ ని నో ప్రాబ్లం వల్ల తక్కువ వర్షపాతం నమోదయిందని అన్నారు. వరికి ప్రత్యన్నయ్య మెట్ట పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా ఎకరాకు 8000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశించినంతగా వానలు పడడం లేదని ఈ సంవత్సరం సేద్యం ఎలా ఉంటుందని భయాందోళనతో రైతులు విత్తనాలు నాటారన్నారు. దాదాపు 30 శాతం విత్తనాలు మొలకత్తలేదని, నకిలీ విత్తనాల బెడద వల్ల కొన్ని జిల్లాలలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. మిట్ట పంటలకు అవసరమయ్యే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వరి పండిన పొలాలకు మిట్ట పంటలకు మళ్లించాలంటే అవసరమైన భూసారాన్ని పెంచడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని, మంచి దిగుబడి ఉండదని, పంటలకు మద్దతు ధరలు అమలవుతాయా లేదా అన్న సందేహంతో రైతులు ఆందోళన పడుతున్నారన్నారు. రైతులకు దయ్యాన్ని ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మిట్ట పంటలన్నిటికీ మద్దతు ధరలను గ్యారెంటీగా అమలు కావడానికి మార్కెట్ శక్తులను నియంత్రించాలని, అవసరమైన మార్కెట్ జోక్యం నిధులను కేటాయించి మద్దతు ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ధైర్యంగా భవిష్యత్తులో కూడా పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతు అనుకూల చర్యలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు విజయలక్ష్మి పండిత్,మాజీ విద్యార్థి నాయకుడు పీర్ ముహమ్మద్ అనంతయ్య విమలమ్మ,సావిత్రమ్మ,బాబు తదితరులు పాల్గొన్నారు.






# ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధం

- నిరంజన్ రెడ్డి
- 'సర్' ప్రక్రియలో మరింత చురుకుగా పనిచేయాలి
- పట్టణ బీఆర్ఎస్ నాయకులు, బీఎల్ఏలతో మాజీ మంత్రి సమీక్ష

**వనపర్తి,జులై 14(ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే అత్యంత శక్తివంతమైన ఆయుధమని, నిజమైన ఓటర్ల నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ నాయకులు, బీఎల్ఏలతో కలిసి 'సర్' (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రక్రియ పురోగతిని సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ఓటరు జాబితా నమోదు కార్యక్రమం ఆశించిన స్థాయిలో సాగడం లేదని, మిగిలిన రోజుల్లో నాయకులు, కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేసి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు 'సర్' ప్రక్రియలో చురుకుగా పాల్గొంటున్నారని అధికారులు కూడా అభినందిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజకీయ పార్టీలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. నిజమైన ప్రజాసంక్షేమ పాలన రావాలంటే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలని, అందుకోసం నాయకులు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని ఓటరు నమోదు చేయించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా నాయకులు ప్రజల మధ్యే ఉండాలని, ఈ పది రోజుల పాటు బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు.

**నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డి సుడిగాలి పర్యటనలు**

ప్రభుత్వం చేపట్టిన 'సర్' ప్రక్రియ విజయవంతం కావాలనే లక్ష్యంతో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేస్తూ ఆయన నిర్వహిస్తున్న పర్యటనలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. 'అభివృద్ధితో పోటీ పడలేక వ్యక్తిగత విమర్శలు' రాజకీయ ప్రయోజనాల కోసం అధికార పార్టీ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని నందిమల్ల అశోక్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతుంటే ప్రజలకు సహకరించాల్సిన వారు రాజకీయ విమర్శలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. అభివృద్ధి విషయంలో నిరంజన్ రెడ్డి సాధించిన పనితీరుతో పోటీ పడలేక వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని, అలాంటి నాయకులకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి అర్హుడూ తన ఓటును నమోదు చేసుకోవాలని, రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి కట్టుబడి పనిచేసే నాయకులను ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, గట్టు యాదవ్,బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్,కురుమూర్తి యాదవ్, కౌన్సిలర్లు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘం ఎస్ఐఅర్ ప్రక్రియకు మరింత గడువు ఇవ్వాలి

- బలమైన ప్రజాస్వామ్యనికి పునాది ఓటు హక్క కోహిర్ కౌన్సిలర్ ఏం ఏ కలిమ్
- ఎస్ఐఅర్ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**జహీరాబాద్ జూలై14 (ప్రజాక్షేత్రం):**



ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలను ఎన్నుకొనేందుకు ఓటు హక్కే ఆయుధం, మంచి పరిపాలన కోసం కోసం పునాది ఓటు అని, ఓటు అనే ఆయుధం ద్వారానే మనం మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే అవకాశం ఉందని కోహిర్ మున్సిపల్ కౌన్సిలర్ ఏం ఏ కలిమ్ అన్నారు. మంగళవారం నాడు పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 24 తో ముగియనున్న ఎస్ఐఅర్ ప్రక్రియ కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరింత గడువు ఇవ్వాలని, కొందరు ఓటర్లు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నందున అలాంటివారి కోసం గడువును పొడగించి వారి ఓటు హక్కును కాపాడాలని, బూత్ లెవల్ అధికారుల ద్వారా ఎస్ఐఅర్ ఫారలను అందుకున్న ఓటర్లు తమ తమ ఫారలను సంబంధిత అధికారులకు సమర్పించాలనీ కోరారు. ప్రజలు ఇప్పటికైనా స్పందించి ఎస్ఐఅర్ ప్రక్రియి పూర్తిచేకోవాలని సూచించారు.



# నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

**భద్రాచలం,జూలై14:(ప్రజాక్షేత్రం):**

భద్రాచలం పట్టణానికి చెందిన సీనియర్ అడ్వకేట్ కె. విద్యాసాగర్ మరణం పట్ల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె. విద్యాసాగర్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. విద్యాసాగర్ న్యాయవాద వృత్తిలో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

- కొత్తకోటలో ట్రాఫిక్ మళ్లింపు..
- 'నో ఫ్లయింగ్ జోన్' అమలు
- నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ఆంక్షలు
- డ్రోన్లు, బెలూన్లు, పారామోటార్ల వినియోగంపై నిషేధం..
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**కొత్తకోట,జూలై 14 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేడు కొత్తకోట పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌకర్యం, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు నేటి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొత్తకోట పట్టణంలో తాత్కాలిక ట్రాఫిక్ మళ్లింపుతో పాటు పట్టణ పరిధిని నో ఫ్లయింగ్ జోన్' గా ప్రకటించినట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి శనివారం వెల్లడించారు.ముఖ్యమంత్రి పర్యటనకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకుని పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి సహకరించాలని, అనవసరంగా కొత్తకోట పట్టణంలోకి వాహనాలతో ప్రవేశించవద్దని సూచించారు.

**ఇవి ప్రత్యామ్నాయ మార్గాలు**

వనపర్తి నుంచి ఆత్మకూరు వెళ్లే వాహనాలు పెద్దగూడెం-రాయన్‌పేట మీదుగా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44) చేరుకుని ఆత్మకూరుకు వెళ్లాలని సూచించారు. ఆత్మకూరు నుంచి వనపర్తికి వచ్చే వాహనాలు కూడా ఎన్‌హెచ్-44 మీదుగా రాయన్‌పేట-పెద్దగూడెం మార్గంలో ప్రయాణించాలని తెలిపారు.

వనపర్తి నుంచి మహబూబ్‌నగర్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు పెద్దమందడి మీదుగా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44) చేరుకుని గమ్యస్థానాలకు వెళ్లాలని, మహబూబ్‌నగర్ నుంచి వనపర్తి వచ్చే వాహనాలు ఎన్‌హెచ్-44 నుంచి పెద్దమందడి మార్గాన్ని వినియోగించాలని సూచించారు.

**డ్రోన్లకు నో.. కఠిన చర్యలు తప్పవు**

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అత్యున్నత భద్రతా చర్యల్లో భాగంగా కొత్తకోట పట్టణ పరిధిని తాత్కాలికంగా 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించినట్లు ఎస్పీ తెలిపారు. డ్రోన్లు, కెమెరా డ్రోన్లు, బెలూన్లు, పారామోటార్లు, రిమోట్ కంట్రోల్‌తో ఎగిరే పరికరాలు, ఇతర మానవరహిత వైమానిక పరికరాలను సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా వినియోగించడాన్ని పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎస్పీ, ఈ ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. డ్రోన్లు లేదా ఇతర ఎగిరే పరికరాలను అనుమతి లేకుండా వినియోగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు, మార్గదర్శక బోర్డులను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని, పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.




# టాక్లి లో మరోసారి భగ్గుమన్న వర్గ పోరు..!

- **40 రోజుల వ్యవధిలో రెండవసారి గ్రామంలో గొడవలు**
- **పలువురికి తీవ్ర గాయాలు, పరారీలో కొందరు..?**
- **ముందస్తు జాగ్రత్తలు తీసుకోని పోలీసులు..?**

**బాన్సువాడ, జులై 14(ప్రజాక్షేత్రం):**

బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలం టాక్లి గ్రామంలో మరోసారి వర్గ పోరు భగ్గుమంది. నెలరోజుల క్రితం గ్రామంలో గెలిచిన సర్పంచ్ ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థుల కుటుంబాల మధ్య ఘర్షణ జరగగా అది మనసులో ఉంచుకున్న ఓ వర్గం మనుషులు మరో వర్గంతో మంగళవారం మరోసారి ఘర్షణకు దిగారు. పొలాల్లో పని చేసుకుంటున్న వారిపై ఒక్కసారిగా వచ్చి కర్రలు రాడ్లతో దాడి చేయగా ఈ ఘర్షణలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అవ్వగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అవ్వగా కాళ్లు చేతులు విరిగినట్లు సమాచారం. గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పెను ప్రమాదం జరిగిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో జరుగుతున్న పరిస్థితులను గ్రామ పోలీస్ అధికారి ఎప్పటికప్పుడు పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉన్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో అల్లకల్లోలం జరిగిందని ప్రజలు అంటున్నారు. నెల రోజుల క్రితం జరిగిన దాడుల్లో ఇరు వర్గాల పై కేసులు చేసి చేతులు దులుపుకున్న పోలీసులు గ్రామంలో పరిస్థితులను పసిగట్టలేకపోయారని ప్రజలు మండిపడుతున్నారు. పొలంలో పనిచేసుకుంటున్న కొందరిపై కర్రలతో విచక్షణారహితంగా దాడికి దిగిన వారిని చూసి అక్కడ పనిచేస్తున్న కూలీలు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనలో క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసిన కొందరిపై కూడా వారు దాడికి దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలు అవ్వగా దాడికి పాల్పడిన వారు పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది. చివరకు అక్కడకు చేరుకున్న స్థానికులు గాయాల పాలైన వారిని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా ఎన్నికల సమయంలో జరిగిన వాటిని మనసులో పెట్టుకొని దాడులకు దిగబడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. వర్గ పోరుతో గ్రామంలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి గ్రామంలోని పరిస్థితులను అదుపులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై రుద్రూర్ సర్కిల్ సిఐ కృష్ణ, కోటగిరి ఎస్ఐ శ్రీనివాస్ ను వివరణ కోరగా పాత గొడవలను మనసులో పెట్టుకొని కొందరు సర్పంచ్ కుటుంబీకులపై కర్రలతో దాడికి దిగారని ఈ దాడిలో గాయాలైన వారిని చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని, బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ వారిపై పలు సెక్షన్ల తో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేసిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.





## ఓటు హక్కు కాపాడుకోనేందుకు ప్రజలు త్వరపడాలి

- **బలమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు హక్కే ఆయుధం కౌన్సిలర్ పెద్దబాయి మహిపాల్**

**జహీరాబాద్ జూలై 14 (ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన అయుదామని, తమకు ఓటు హక్కు ఉన్నప్పుడే అన్నీ సంక్షేమ కార్యక్రమలు అందె అవకాశం ఉందని, వార్డు ప్రజలు ఓటు హక్కును కాపాడుకోనేందుకు బాధ్యతగా ముందుకు రావాలని, విధిగా ఎస్ఐఅర్ ప్రక్రియలో భాగస్వమ్యం ఎన్నికల సంఘం సుచించిన విధంగా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని 37 వ వార్డు కౌన్సిలర్ పెద్దబాయి మహిపాల్ అన్నారు. సోమవారం నాడు పట్టణంలోని ఆదర్శ నగర్ పాఠశాల ఆవరణలో స్థానిక కౌన్సిలర్ మహిపాల్ యాదవ్ బృందం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎస్ఐఅర్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం విధించిన గడువు కోసం ఎదురు చూడకుండా ముందుగానే ఎన్యూమరేషన్ ఫారంలు ఇస్తే దానికి ఆన్లైన్ చేసేందుకు సమయం పడుతున్నందున ప్రజలు ముందుగానే ఫారంలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు ఇవ్వాలని, సమయం తక్కువ ఉన్నందున ప్రజలు వేగంగా ముందుకు వచ్చి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మఠం విశ్వనాథ్ స్వామి, శ్రీమతి మాధవి రిసోర్స్ పర్సన్, బూత్ లెవల్ అధికారులు విద్యావతి, చంద్రకళ, మున్సిపల్ టెక్నీకల్ సిబ్బంది మహేష్ కుమార్,మధుగొండ శ్రీనివాస్,నాయకులు తదితరులు ఉన్నారు.

## చిలుకూరు శ్రీను ని సన్మాని ఐఎన్టియూసి జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం,జూలై 14(ప్రజా-క్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో జరిగిన చేనేత సహకార సంఘం ఎలక్షన్లలో ఘన విజయం సాధించి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పత్రికా రిపోర్టర్ చిలుకురి శ్రీనివాస్ నీ అభినందిస్తూ శాలువాతో సన్మానించిన ఐఎన్టియూసి యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ లింగస్వామి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్నేహ స్వభావి అందరిని కలుపుకుపోయే మనస్తత్వం ఉన్నటువంటి. చిలుకూరు శ్రీను ఎన్నికల్లో ఘన విజయం సాధించడం చాలా ఆనందాన్ని కలిగించిందని అదేవిధంగా తను స్వీకరించబోయే పదవి బాధ్యతల ద్వారా చేనేత సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ సంఘంలో మంచి పేరు సంపాదించాలని వారికి ఆయురారోగ్యంతో భగవంతుడు చూడాలని మనస్ఫూర్తిగా కోరారు.

## అర్ధరాత్రి వరకు షాపులు.. ముగ్గురిపై ఈపెట్టి కేసులు

- **స్వచ్ఛభారత్ సేవ చేయించిన పోలీసులు**

**చర్లపల్లి, జూలై 14(ప్రజా క్షేత్రం):**



నిర్ణీత సమయాన్ని దాటినా దుకాణాలు నిర్వహించిన ముగ్గురు వ్యాపారులపై చర్లపల్లి పోలీసులు ఈపెట్టి కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని కుషాయిగూడలోని 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం మేజిస్ట్రేట్ మంగళవారం ముగ్గురికి కమ్యూనిటీ సర్వీస్ కింద స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పరిశుభ్రత పనులు నిర్వహించాలంటూ శిక్ష విధించారు. కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి పోలీసులు శిక్షను అమలు చేయించి సంబంధిత ప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో వారితో సేవలు చేయించారు. పోలీసులు నిర్ణీత సమయం దాటిన తర్వాత దుకాణాలు నిర్వహించవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బాసర రైల్వే స్టేషన్‌లో చైన్ స్నాచింగ్ కలకలం!

**నిర్మల్ జిల్లా జూలై 14(ప్రజాక్షేత్రం):**

రైలు ప్రయాణంలో ఓ వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన బాసర రైల్వే స్టేషన్‌లో కలకలం రేపింది. కిటికీ గుండా చేయి పెట్టి మంగళసూత్రాన్ని తెంచుకెళ్లిన ఈ ఘటన ప్రయాణికుల్లో భయాందోళనలు నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం:ఓ వృద్ధురాలు షిర్డీ దర్శనం ముగించుకుని నాగర్‌సోల్ నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాజీపేటకు ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో రైలు బాసర రైల్వే స్టేషన్‌లో ఆగింది. అదే సమయంలో అక్కడ మాటు వేసిన గుర్తు తెలియని దుండగులు రైలు కిటికీలోంచి అకస్మాత్తుగా చేయి పెట్టి, సదరు వృద్ధురాలి మెడలోని సుమారు ఆరు తులాల బంగారు మంగళసూత్రాన్ని బలంగా లాక్కొని క్షణాల వ్యవధిలో పరారయ్యాడు.బాధిత వృద్ధురాలు కాజీపేట రైల్వే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, ఘటన బాసర పరిధిలో జరగడంతో ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాసర రైల్వే స్టేషన్, దాని పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.





## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి హత్య యత్నం కేసు నమోదు చెయ్యాలి

- **పెద్దపల్లి జర్నలిస్టుల డిమాండ్**

**పెద్దపల్లి, జూలై 14(ప్రజాక్షేత్రం)**

జర్నలిస్టుపై జరిగిన దాడి ఘటనలో నిందితుల పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని పెద్దపల్లి జిల్లా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులు మాట్లాడుతూ.. పెద్దపల్లి సుమన్ టీవీ ప్రతినిధి శ్రీకాంత్ పై ఔట్సోర్సింగ్ పేషంట్ కేర్ సిబ్బంది దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం జర్నలిస్టుపై జరిగిన దాడి కాదని, అది ప్రజాస్వామ్య విలువలపై, భావ ప్రకటన స్వేచ్ఛపై, ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించే హక్కుపై జరిగిన దాడిగా అభివర్ణించారు. సమాజంలో జరుగుతున్న విషయాలను నిర్భయంగా ప్రజలకు చేరవేయడం జర్నలిస్టుల బాధ్యత అని, అలాంటి విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టంలోని కఠినమైన సెక్షన్ల కింద, ముఖ్యంగా హత్యాయత్నం కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని వారు పోలీసు అధికారులను కోరారు. నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం భద్రత కల్పించాలని కోరారు. మీడియా స్వేచ్ఛను హరించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. గాయపడిన జర్నలిస్టు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు యూనియన్ వ్యవస్థాపకుడు అరెల్లి మల్లేష్, ప్రవీణ్ రెడ్డి, కాల్వ రమేష్, బందెల రాజశేఖర్, సుధాకర్, సంపత్, రాజు, ధార మధు, తిరుపతి, శంకర్, శ్రీనివాస్,జైపాల్, అక్షయ్, శ్రీనివాస్, భాస్కర్, భూమేష్, శ్రీకాంత్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ఘనంగా వనమహోత్సవం

- **తిరుమల వెంచర్‌లో మొక్కలు నాటిన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

**చౌటుప్పల్ జూలై 14(ప్రజాక్షేత్రం):**

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 202627 వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు తిరుమల వెంచర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా జరిగింది.;ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ సారథ్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్ల బృందం, కోఆప్షన్ సభ్యులు, కృష్ణవేణి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. పాల్గొన్న కౌన్సిలర్ లు, కోసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య,
పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఊదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆలే శ్రీలత చిరంజీవి, బద్రి గాలయ్య, దేపా రమ్య రాజు, పాక చిరంజీవి, గడ్డం ఇందిర రాజరత్నం, చింతల ఉమా మహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్, పాల్గొన్న కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, మహమ్మద్ బాబా షరీఫ్, షేక్ నబీబి కృష్ణవేణి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయ బృందం, మరియు కాలనీ నివాసితులు ఈ వనమహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "వృక్షో రక్షతి రక్షితః మొక్కలను నాటుదాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం!పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమని చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, పాటలు పాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని కంటికి రెప్పలా సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తిరుమల టౌన్షిప్ కాలనీ అధ్యక్షులు మేడి రాములు, కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్ పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ మరియు విద్యార్థులు అందరూ కలిసి కాలనీ వార్డు ఆఫీస్ ప్రాంగణంలో నీడను, పూలను ఇచ్చే వివిధ రకాల మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ ఒక కర్తవ్యంగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఈ సందర్భంగా కోరారు.



## పొన్నం ఇంటి ముట్టడికి ఎస్ఎఫ్ఐ యత్నం ఉద్రిక్తత

- **ఎస్ఎఫ్ఐ నేతల అరెస్ట్**

**కరీంనగర్, జూలై 14(ప్రజాక్షేత్రం):**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసాన్ని ముట్టడించేందుకు ఎస్ఎఫ్ఐ శ్రేణులు మంగళవారం యత్నించాయి. ఈ సందర్భంగా నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి నివాసానికి ర్యాలీగా బయలుదేరిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. బలవంతపు అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## బాధితులకు 31 మొబైల్ ఫోన్లు అప్పగింత

- **సీఈఐ ఆర్ తో ట్రేస్**
- **రూ.12 లక్షల విలువైన ఫోన్లు తిరిగి అందజేసిన వన్‌టౌన్ పోలీసులు**

**కరీంనగర్, జూలై 14(ప్రజాక్షేత్రం):**

సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన సుమారు రూ.12 లక్షల విలువైన 31 మొబైల్ ఫోన్లను కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు మంగళవారం వాటి యజమానులకు అప్పగించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి బాధితులకు ఫోన్లను అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే ఫోన్‌ను గుర్తించి తిరిగి స్వాధీనం చేసి అప్పగించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అందించడంలో కృషి చేసిన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394

# ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే: సీనియర్లతో బరిలోకి భారత్.. టాస్ నెగ్గిన ఇంగ్లండ్

- **భారత్‌తో తొలి వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్**
- **పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందన్న కెప్టెన్ హ్యారీ బ్రూక్**
- **సీనియర్ల రాకతో జట్టుకు అదనపు బలం చేకూరిందన్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్**
- **ఇంగ్లండ్ తరపున వన్డే అరంగేట్రం చేసిన ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్**
- **200వ వన్డే ఆడుతున్న ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్**

**ప్రజాక్షేత్రం:**

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌కు తెరలేచింది. ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో ఇంగ్లండ్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది.
టాస్ గెలిచిన అనంతరం ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ.. పిచ్ పరిస్థితులను అంచనా వేసి బ్యాటింగ్ ఎంచుకున్నట్లు తెలిపాడు. "పిచ్ ఆరంభంలో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉంది. అందుకే ముందుగా బ్యాటింగ్ చేసి భారీ స్కోరు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించాడు. టీ20 సిరీస్‌లో అనుసరించిన దూకుడైన వ్యూహంతోనే ఈ సిరీస్‌ను కూడా ఆడతామని స్పష్టం చేశాడు. గత కొంతకాలంగా వన్డే ఫార్మాట్‌లో తమ ప్రదర్శన నిలకడగా లేనప్పటికీ, ఈ సిరీస్‌తో దానిని అధిగమించి స్థిరమైన విజయాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇద్దరు స్పిన్నర్లు, ముగ్గురు సీమర్లతో సమతూకమైన బౌలింగ్ విభాగంతో బరిలోకి దిగుతున్నట్లు బ్రూక్ పేర్కొన్నాడు.
ఈ మ్యాచ్ ఇంగ్లండ్ జట్టుకు పలు మైలురాళ్లను అందించింది. వికెట్ కీపర్‌బ్యాటర్ జోస్ బట్లర్ తన 200వ వన్డే ఆడుతున్నాడు. ఇయాన్ మోర్గాన్ (225 వన్డేలు) తర్వాత ఇంగ్లండ్ తరపున ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా అతను నిలిచాడు. అదేవిధంగా, యువ ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్ ఈ మ్యాచ్ ద్వారా వన్డే ఫార్మాట్‌లో అరంగేట్రం చేయగా, స్పిన్నర్ లియామ్ డాసన్ తన 50వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్నాడు.
భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తాము టాస్ గెలిచి ఉంటే ఫీల్డింగ్ ఎంచుకునేవాళ్లమని చెప్పాడు. "ఇక్కడి వాతావరణం, పిచ్ పరిస్థితులు భారత్‌లో కంటే దక్షిణాఫ్రికాలో ఉన్నట్లుగా అనిపిస్తున్నాయి. అందుకే మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం" అని అన్నాడు. ఈ సిరీస్ ద్వారా తక్కువ వన్డే అనుభవం ఉన్న



ఆటగాళ్లకు అవకాశాలు కల్పించాలనేది తమ ఉద్దేశమని తెలిపాడు.
విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, జస్ప్రీత్ బుమ్రా వంటి సీనియర్ ఆటగాళ్లు జట్టులోకి తిరిగి రావడం ఎంతో సానుకూలాంశమని, వారి అనుభవం జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుందని గిల్ ధీమా వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్‌లో తనకు మంచి రికార్డు ఉందని, టెస్టు సిరీస్‌లో కనబరిచిన ఫామ్‌ను వన్డేల్లోనూ కొనసాగిస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. నలుగురు సీమర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నట్లు గిల్ వెల్లడించాడు.

**జట్ల వివరాలు:**
భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, గుర్నూర్ బ్రార్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ.
ఇంగ్లండ్: జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), శామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, అదిల్ రషీద్.

# భారత్‌ఇంగ్లండ్ వన్డే సిరీస్.. ద్రావిడ్ 15 ఏళ్ల రికార్డుపై కోహ్లీ, రోహిత్ కన్ను

- **ఇంగ్లండ్ గడ్డపై ద్రావిడ్ వన్డే రికార్డుకు చేరువలో కోహ్లీ, రోహిత్**
- **అగ్రస్థానం కోసం కోహ్లీకి 68, రోహిత్‌కు 239 పరుగులు అవసరం**
- **దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న రాహుల్ ద్రావిడ్ రికార్డు**
- **టీ20 సిరీస్‌లో ఓటమి తర్వాత సీనియర్లతో బరిలోకి దిగుతున్న భారత్**
- **2027 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్‌కు అధిక ప్రాధాన్యం**

**ప్రజాక్షేత్రం:**

భారత క్రికెట్ జట్టు వెటరన్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఓ అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నారు. ఇవాళ్టి నుంచి ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో వీరిద్దరూ రాణిస్తే, ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ జాబితాలో భారత జట్టు మాజీ కెప్టెన్ రాహుల్ ద్రావిడ్ అగ్రస్థానంలో ఉన్నాడు.
దాదాపు 15 ఏళ్లుగా ఈ రికార్డు ద్రావిడ్ పేరు మీదే ఉంది. అతను 1996 నుంచి 2011 మధ్య ఇంగ్లండ్‌లో 20 వన్డేలు ఆడి 38.11 సగటుతో 648 పరుగులు చేశాడు. ఇందులో ఏడు అర్ధ సెంచరీలు ఉన్నా, ఒక్క సెంచరీ కూడా లేదు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ 17 మ్యాచ్‌ల్లో 639 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, ఎంఎస్ ధోనీ 21 మ్యాచ్‌ల్లో 613 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు.
ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీ, ఈ రికార్డును అధిగమించడానికి కేవలం 68 పరుగులు మాత్రమే దూరంలో ఉన్నాడు. కోహ్లీ ఇప్పటివరకు 16 వన్డేల్లో 38.73 సగటుతో 581 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, నాలుగు అర్ధ సెంచరీలు ఉన్నాయి. మరోవైపు టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ ఈ ఘనత సాధించాలంటే 239 పరుగులు చేయాల్సి ఉంది. అయితే, ఇంగ్లండ్‌లో రోహిత్ సగటు అద్భుతంగా ఉంది. అతను 10 ఇన్నింగ్స్‌లలో




నే 58.57 సగటుతో పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోరు 137 నాటౌట్. టీ20 సిరీస్‌లో ఎదురైన పరాభవం నేపథ్యంలో ఈ వన్డే సిరీస్ భారత్‌కు అత్యంత కీలకంగా మారింది. ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగు టీ20ల సిరీస్‌లో 40తో ఓటమి పాలవ్వడం, అంతకుముందు ఐర్లాండ్‌లోనూ పరాజయాలు ఎదురవ్వడంతో జట్టు యాజమాన్యం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా వంటి సీనియర్ ఆటగాళ్లను తిరిగి జట్టులోకి పిలిచింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టుకు 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్ ఎంతో ముఖ్యమైనది.
ఐపీఎల్‌లో తొడ కండరాల గాయం కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమైన కోహ్లీ, దేశవాళీ టీ20 టోర్నీలో మంచి ఫామ్‌తో తిరిగి జట్టులోకి వచ్చాడు. మరోవైపు ఇటీవలి కాలంలో ఇంగ్లండ్‌పై వైట్‌బాల్ క్రికెట్‌లో రోహిత్ అద్భుతంగా రాణించాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్ కావడంతో కోహ్లీ ఈ రికార్డును సులభంగానే అందుకునే అవకాశం ఉంది. అయితే, రోహిత్ అగ్రస్థానానికి చేరాలంటే సిరీస్‌లో అసాధారణ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఈ వెటరన్ ఆటగాళ్లకు బహుశా ఇదే చివరి విదేశీ పర్యటనల్లో ఒకటి కావొచ్చని భావిస్తున్న తరుణంలో వారు రికార్డు సాధించడం అభిమానులకు మరింత ప్రత్యేకంగా నిలవనుంది.

# భారత్‌లో తొలి మ్యాచ్.. కొత్త రూల్స్..బీబీఎల్16 షెడ్యూల్ హైలైట్స్ ఇవే!

- **తొలిసారిగా ఆస్ట్రేలియా వెలుపల బీబీఎల్ మ్యాచ్.. చెన్నైలో ఆరంభం**
- **మొత్తం 40 రెగ్యులర్ సీజన్ మ్యాచ్‌లతో సరికొత్త ఫార్మాట్**
- **నాలుగేళ్ల విరామం తర్వాత తిరిగి వచ్చిన క్రిస్మస్ ఈవ్ మ్యాచ్**
- **ఐపీఎల్ తరహాలో కొత్త రూల్స్.. డెజిగ్నేటెడ్ బ్యాటర్, ఫీల్డర్ విధానం**

**ప్రజాక్షేత్రం:**

ఆస్ట్రేలియాలో క్రికెట్ అభిమానులకు పండగలాంటి వార్త. ప్రతి ఏటా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే కేఎఫ్‌సీ బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) 16వ సీజన్ షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) విడుదల చేసింది. ఈసారి లీగ్‌లో ఎన్నో చారిత్రక మార్పులకు శ్రీకారం చుట్టారు. బీబీఎల్ చరిత్రలోనే తొలిసారిగా ఒక మ్యాచ్‌ను ఆస్ట్రేలియా వెలుపల, అదీ భారత్‌లోని చెన్నైలో నిర్వహించనున్నారు. అంతేకాకుండా నాలుగేళ్ల తర్వాత మళ్లీ క్రిస్మస్ ఈవ్ (డిసెంబర్ 24) రోజున మ్యాచ్‌ను ప్రవేశపెడుతూ అభిమానులకు డబుల్ ధమాకా అందించారు.
202627 వేసవి సీజన్‌ను మరింత ఉత్సాహభరితంగా మార్చే లక్ష్యంతో ఈ షెడ్యూల్‌ను రూపొందించారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో ఈ సీజన్ అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ తొలి మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, డిఫెండింగ్ ఛాంపియన్ పెర్త్ స్కార్చర్స్‌తో తలపడనుంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:40 గంటలకు ఈ మ్యాచ్ మొదలవుతుంది. ఆస్ట్రేలియా, భారత ప్రధానులు సంయుక్తంగా ఈ చారిత్రక మ్యాచ్‌ను ప్రకటించడం విశేషం.
ఆస్ట్రేలియాలో సందడి.. కీలక మ్యాచ్‌ల వివరాలు చెన్నై మ్యాచ్ తర్వాత అసలు సిసలైన బీబీఎల్ సందడి ఆస్ట్రేలియాలో మొదలవుతుంది. డిసెంబర్ 15న గబ్బా స్టేడియంలో బ్రిస్బేన్ హీట్, సిడ్నీ సిక్సర్స్ మధ్య మ్యాచ్‌తో ఆసీస్ గడ్డపై టోర్నీ ప్రారంభమవుతుంది. ఈ సీజన్‌లో మొత్తం 40 రెగ్యులర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. క్రిస్మస్ రోజు మినహా దాదాపు ప్రతిరోజూ మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి.
ఈసారి షెడ్యూల్‌లో క్రిస్మస్ ఈవ్ మ్యాచ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నాలుగేళ్ల విరామం తర్వాత, డిసెంబర్ 24న మెల్‌బోర్న్‌లోని జంక్షన్ ఓవల్ మైదానంలో రెనెగేడ్స్, హోబర్ట్ హరికేన్స్




జట్లు తలపడనున్నాయి. ఈ మైదానంలో కొత్తగా ఫ్లడ్‌లైట్స్ ఏర్పాటు చేశారు. ఇకపై మార్వెల్ స్టేడియంలో మ్యాచ్‌ల సంఖ్యను తగ్గిస్తూ, మెల్‌బోర్న్ డెర్బీ మ్యాచ్‌లను ప్రతిష్టాత్మక ఎంసీజీకి మార్చారు. బాక్సింగ్ డే, న్యూ ఇయర్ ఈవ్ రోజుల్లో కూడా బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌లను షెడ్యూల్ చేశారు.

**ఐపీఎల్ తరహాలో కొత్త రూల్స్**
గేమ్‌లో వ్యూహాత్మక లోతును పెంచేందుకు ఈసారి ఐపీఎల్ తరహాలో కొత్త నిబంధనలను ప్రవేశపెడుతున్నారు. దీని ప్రకారం, ప్రతి జట్టు ఒక 'డెజిగ్నేటెడ్ బ్యాటర్' (ఫీల్డింగ్ చేయని ఆటగాడు), ఒక 'డెజిగ్నేటెడ్ ఫీల్డర్/కీపర్' (బ్యాటింగ్, బౌలింగ్ చేయని ఆటగాడు)ను నామినేట్ చేయవచ్చు. ఈ మార్పు ఆటను మరింత ఆసక్తికరంగా మారుస్తుందని అంచనా వేస్తున్నారు.
జనవరి 19న ఫైనల్స్ సిరీస్ ప్రారంభమై, జనవరి 26న ఆస్ట్రేలియా డే రోజున జరిగే గ్రాండ్ ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది. బీబీఎల్ జనరల్ మేనేజర్ అలిస్టర్ డాబ్సన్ మాట్లాడుతూ.. "ఈ సీజన్ అభిమానులకు అద్భుతమైన వినోదాన్ని పంచనుంది. చెన్నైలో ఆరంభ మ్యాచ్, క్రిస్మస్ ఈవ్ పునరాగమనం, కొత్త నిబంధనలు లీగ్‌కు కొత్త ఉత్సాహాన్ని తెస్తాయి" అని తెలిపారు. ఫాక్స్ క్రికెట్, కేయో స్పోర్ట్స్, సెవెన్ నెట్‌వర్క్‌లలో అన్ని మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.



# పెంచాలని విజ్ఞప్తి చేశాం: మంత్రి పొన్నం

- **సీఈవో సుదర్శన్ రెడ్డిని కలిసిన మంత్రి పొన్నం, కాంగ్రెస్ నేతలు**

**హైదరాబాద్ జులై 14(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో సర్ గడువు పొడిగింపుపై మంగళవారం నాడు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బలమురి వెంకట్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, నవీన్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, మోత రోహిత్, టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేటర్ కమిటీ చైర్మన్ రాజేష్ తదితర నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసి తెలంగాణలో సర్ గడువును పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. సర్ ప్రక్రియపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి పొన్నం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పెంచాలని సీఈఓను కోరామని వెల్లడించారు. బీఎల్వోలు ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వట్లేదని ఫిర్యాదు వస్తున్నాయని వివరించారు. అర్హులైన ఓట్లు తొలగించకుండా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించామన్నారు. ప్రభుత్వం, ప్రజలు ఈసీ భాగస్వామ్యం

# ఏసీబీ వలలో హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి..

- **బయటపడ్డ కోట్ల ఆస్తులు**
- **హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్‌పై ఏసీబీ కేసు**
- **అక్రమాస్తుల ఆరోపణలపై ఏకకాలంలో సోదాలు**
- **రికార్డుల ప్రకారం రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు**
- **నగదు, బంగారం, ఫ్లాట్లు, భవనాలు స్వాధీనం**
- **అధికారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన ఏసీబీ**




**హైదరాబాద్ జులై 14(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు, రికార్డుల ప్రకారం సుమారు రూ.9.24 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బీ), 13(2) కింద రవీందర్‌పై కేసు నమోదైంది. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటిలో కొండకల్, కిష్టాపూర్, పసమాముల గ్రామాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రాంగూడలో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు ఫ్లాట్లు, కొండాపూర్ మసీద్ బండలో రూ.3 కోట్ల విలువైన జీ+4 భవనం, మోకిలలో రూ.1.33 కోట్ల విలువైన సెమీఫినిష్డ్ విల్లా ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన దానికంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది. వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.45.06 లక్షలు, రూ.36.7 లక్షల విలువైన 1.44 కిలోల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, నాలుగు వాహనాలు, ఇతర గృహోపకరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, మరిన్ని ఆస్తుల వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

# నేడు భైంసాకు జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల!

**నిర్మల్ జిల్లా జూలై 14(ప్రజాక్షేత్రం):**




ప్రజల చెంతకే పోలీస్ పాలనను చేరవేస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ధ్యేయంగా జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల గారి ప్రత్యక్ష ఆధ్వర్యంలో భైంసా పట్టణంలో ఈ నెల 15 (బుధవారం) నాడు భారీ స్థాయిలో "ప్రజా ఫిర్యాదుల శిబిరం" (గ్రీవెన్స్ సెల్) నిర్వహించనున్నారు. స్థానిక పోలీస్ యంత్రాంగం ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.సమయం.. నిబంధనలు ఇవే:బుధవారం ఉదయం 10:00 గంటలకే ఈ వినతుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమై, మధ్యాహ్నం 1:00 గంట వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. భైంసా డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు, ఫిర్యాదుదారులు ఎవరైనా సరే. మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా నేరుగా ఈ శిబిరానికి హాజరుకావచ్చు. తమ సమస్యలపై లిఖితపూర్వక వినతిపత్రాలను స్వయంగా ఎస్పీ గారికి అందించి మాట్లాడేందుకు ఇక్కడ వీలు కల్పించారు. చట్టప్రకారం త్వరితగతిన చర్యలు:ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల గారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాన్య ప్రజలకు న్యాయం చేయడమే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.